శ్రీరస్తు.

కర్ణుండు.

దేవరాజసుధీ ప్రణీతము.

మద్రాస్

ఆర్య ముద్రణాలయ ముద్రితము.

ఆర్. వేంకటేశ్వర్ అండు కంపెనీవారిచే

ప్రకటితము.

1929.



హారాంసాగమనము.

మొలచియున్న చెట్టునుండి యందం దొక్కొక్క పిట్ట కొల
కొలమని కూయుచుండెను. తక్కిన యెడలెల్ల నిశ్శబ్దముగా
నుండెను.

ఇంతలోఁ దూరుపునఁ గొంత తేటఁ దనము పొటమరించు
చుండెను, ఇపుడు బ్రాహ్మముహూర్తము. ఇది స్నాన జపా
దులకు మిక్కిలియు యోగ్యమగు కాలముగదా! అశ్వనదియం
దొకరేవు ప్రక్కన బుడబుడమని శబ్దమేదియో వినవచ్చు
చుండెను. తూర్పుదిక్కునుండి పొంగి పొరలి వ్యాపించుచున్న
వెలుఁగున నటుచూడఁగా నేదో నల్లనియొక వస్తువు కానఁబడు
చుండెను. అది యలలనుండి కొట్టుకొని వచ్చు ప్రాఁచిత్రేఁగెల
గుమిగా నుండునేమో? అట్లు తోఁచుటలేదు. లేచుచు మున్గుచు
నుండుటంబట్టి యదియొక ప్రాణియేయని తోఁచెడిని, మఱియు
నీటియందుఁ బ్రార్థించుచున్న చప్పుడును, వినవచ్చుటచే మానవుఁ
డయి యుండఁబోవును.

సూర్యకిరణములు తూర్పుదిక్కునఁ బైకెగసి యాకసమునఁ
బ్రకాశించుచుండెను. ఇప్పుడాతని దట్టంపు జడలును, గడ్డమును
దేటగాఁ దెలియుచుండెను. అతఁడు మునియైయుండ నోపును.
అతఁడు స్నానముచేసి, సంధ్యవార్చి, నీటినుండి, గట్టుపయికివచ్చి
మడిచియున్న నారచీరయొకటి యెత్తికట్టుకొనెను, పిదప
నతఁడు వీపున నల్లని యిఱ్ఱితోలొకటి వ్రేలాడవైచికొనెను.

అతని చేతియందుఁ గప్పెరవంటి యొక కుండికయును మోదుగు
కోలయు, మఱియొకచేత నక్షసరమును, మెడయందు రుద్రాక్ష
మాలికయు నుండెను. విగ్రహము మిక్కిలి పొడవై తగుపాటి
యొడ్డుపొడుగు గలిగి గోరోజనపు చాయతోఁ గూడియుండెను.
శిరముపై దట్టముగానున్న జడలగుమికిని, మీసల గుబురునకును
నడుమ నాతని మిడిగ్రుడ్లు మిక్కిలి యెఱ్ఱనై వేఁడిచూపులు
నిగుడించుచుండెను.

సూర్యుఁ డుదయించుచుండెను. అతఁడట్లు జపాదులు దీర్చు
కొని దండమును గమండలువు నెత్తికొని యక్షసరము ద్రిప్పుచు
బయలుదేఱెను. ఆ విగ్రహము సమీపించుకొలఁదిఁ జూచు
టకు మిక్కిలి భయంకరముగ నుండెను. అతని యవయవము
లెల్ల దీర్చి కూర్చినట్లు మిక్కిలి దర్శనీయములుగా నుండెను.
గాని ముఖమునందు మాత్ర మెంతయు నుగ్రమగు తేజము
ప్రజ్వలించుచుండెను. ఆతఁడడుగులవేగముగా నిడుటచే భూతల
మదరుచుండెను. దారిని రాయి రప్పలెవ్వి యడ్డపడినను
చీత్కారము గావించును. అతనిపైఁ బెట్టనీడపడినను మిట్టి
పడును. ఎదురుపడిన వానినెల్ల ; "బదపద" మని గ్రుడ్లెఱ్ఱచేసి
యదల్చును. అతని యావేగపు టడుగులును, దీక్ష్ణపు చూపు
లును, మిట్టిపాటును గాంచినచో నతఁడొక మిడిమేలపుఁ దాపసి
యని గోచరించుచుండెను. కోపమే యా రూపముధరించెనో

యనునట్లుండెను. అతఁడు ముందు వెన్కాలు చూడక బిరబిర
మని పోవుచుండెను.

ఆలాగున బోవుచుండు నతఁడొక పట్టణమునఁ బ్రవేశిం
చెను. అది కుంతిభోజుని నగరము, అతఁడచ్చట రాజ వీథిని
బోవుచుండెను. అచ్చటిజను లప్పుడప్పుడే వారివారి పనులకొఱకు
వీథులందు మూఁగుచుండిరి. కొందఱాతనిఁజూచి యాతఁ
డెవ్వఁడో మునీంద్రుఁడగునని తలఁచి దమంతట దారి తొలఁగు
చుండిరి. మఱికొందఱీతనిఁ జూడకయుండి యాతని యడల్పుచే
నులికిపడి యిట్టట్టు పఱచుచుండిరి. ఇతఁడట్లు పోయిపోయి రాచ
నగరు వాకిలిచేరెను.

అచ్చటనున్న ద్వారపాలకునిఁ జూచి యాతఁడు! "తలతల"
మని గద్దించుచునే లోనికిఁజనఁ బోవుచుండెను. దౌవారికుఁ
డీతఁడెవఁడో మహాత్ముఁడుగా నున్నాఁడని యెంచి యాతని
నడ్డగించుటకు వెఱచెను. రాజాజ్ఞ యిట్టిదని తెలియనందున
లోనికి విడువలేక యుపాయమున నిలుపఁదలఁచి ద్వారమున
దణ్డముగాఁబడి యాతనికి సాష్టాంగముగాఁ బ్రణామముచేసెను.
ముని; "ఓరీ! లే లెమ్ము. లోనికిఁ బోవలయు" ననఁగా వాఁడు
"మహాత్మా! తమదివ్యనామము చెప్పినన్నుఁ గృతార్థీకరింపుఁడు.
అంతవఱకు శరణాగతుఁడనగునేనే" ననెను,అంతఋషి,"విని
పింపకపోయిన నీ వేమిసేయఁగలవు? నాయీ మహాత్మ్యోన్నత

చూచిన నే నెవ్వఁడనగు నదియుఁ దెలియుట లేదా?" యనెను.
ఆ మాటలాలకించిన వెంటనె వాఁడు లేచి ద్వారమున కడ్డముగా
నిలువఁబడి. "ఓహో! తెలిసెను తాము దుర్వాస మునీం
ద్రులా! ఇంద్రుఁడు చంద్రుఁడును మీ ప్రభావాబ్ధిని మునిఁగి
దరిగానక యలజడిపడుచుండ నింక బాలిశుఁడనగు నేనే పాటి
వాఁడను?

ముని:—ఏమిరా! వింత లేవో వెలిపెట్టనున్నలాగునఁదోఁచె
దిని. ఇంద్రునిపైకేల యెత్తితివి?

ద్వా:—వింతలేమున్నవి? ఏంతలుగాని మీ ప్రభావము
నకుఁ బట్టియుండెడే? ఆయింద్రునకేకదా తామాదినము దీవించి
పుష్పమాలిక నిచ్చితిరి? అతఁడేమి శిరమునదాల్చెనే? వెల్ల
యేనుఁగు నెక్కుటచేఁగల్గిన సొంపు, త్రిలోకాధిపత్యమున
గల్గిన పెంపు నివి కనుదెలియ నిచ్చునే? ఆ పూలదండ
నాతఁడేనుఁగు తొండమునఁ బెట్టెనుగా! మృగమునకు మందార
పుష్పమేల? అది యాపూలసరమును నలిపివైచెను. ఇఁకఁదెలిసి
నదియేకదా దేవరవారి కోపాటోపము! అతని వైశ్వర్య
నాశము వింతయా? తమయనంత ప్రభావము నుండిట్టి వా
రొకలెక్కయా? దేవతలకుఁ గాదుగదా; వారిఁబుట్టించిన
బ్రహ్మకైనను మీపేరు విన్నగుండె లవియ వలసినదియే.

అట్లుండ నీయింద్రునిమాట వేఱచెప్పనేల? ఆయుధమునకు నూఱుమొనలున్ననేమి? కన్నులు వేయియున్ననేమి?

దుర్వాస:—బాగుబాగు! పెద్దపిన్నల నడవళ్లు కొంత కనివినియున్నావు కాఁబోలు! ఇంకఁజంద్రుని విషయమేమి?

ద్వార:—చంద్రుఁడన నీ చుక్కలలోని పెద్దచుక్క యని తలఁచితిరా! ఇస్సీ! మీచండప్రభావము ముందీ మంచుముద్దయెంత? మీయుద్దండ తేజముయొక్క లేశము సోఁకినను కరఁగిపోవఁడా? నే నాడునదా రామచంద్రునివిషయము. యముఁడాతనితో మాటలాడవచ్చుట దేవరకు విదితమగునదే కదా! ఆతరుణమున నేరాముఁడు తనయాజ్ఞ లేనిదే లోన నెవరేనిఁ జొచ్చినఁ బ్రాణదండనమగు నను పిడుగువంటియాజ్ఞ లక్ష్మణుని కడ తా నాయమునితో మాటలాడ లోని కరిగెను! అతఁడు తన ముద్దులయన్నగారి యాజ్ఞను శిరసావహించెను గాదె! ఆహా! అన్నగారు ముద్దైననాజ్ఞయు ముద్దా! అసమ యమున నేకదా మీ రచటికివచ్చితిరి? మిమ్ములోన వదిలిన నన్నగారికిఁ గోపమువచ్చును. వదలకున్న మీకుఁగోపము వచ్చును. అన్నగారి కోపము దనకొక్కనికే ముప్పునకుఁగారణము, విడువకున్న మీశాపమునఁ గులమునకెల్ల హానికలుగ వచ్చును, వీనిలో నేది యనుష్ఠింపఁదగినదని యాతఁ డాలో

చించెను, తుట్టతుదకు మిమ్ములోన విడచుట కంగీకరించెను. ఇందులకై కాదె సరయూనదిలో ‘గుభిల్లు’మనుచు దుముకవలసి వచ్చెను ! ఆపాటతనితో మాత్రము పోయెనా ? రాముడును రాజ్యములోని ప్రజలనుకూడ నాయకుపడకు చిక్కడికేదా ! ఒక్క మునుకలో నెందఱకుఁ బరమపదము ! ఇట్టిదా మాహాత్మ్యముండవలయును !

దుర్వాస:— చాలసంతోషించితిని, పురాణ కథలలోఁ గూడ నీకుఁ బరిచయమెక్కుడనుట తెలియ వచ్చుచున్నది.

ద్వా:— ఇఁక క్షేమముకోరుచుచే. నేను ఒక్కఁడనై వెలఁ గాలి కాయుచున్నాను, ఇటు సరయువు లేకున్నను దానికంటె నెక్కుడగు సర్వనదియున్నది. మీరింక చేరఁబడిన నేనటుఁ దిగఁబడ వలసినదేకదా ! నేనొక్కఁడ గిట్టినలోక మస్తమింప వదుకాని నాతలిదండ్రులు ముదుసళులు, నాయిల్లాలు పిల్లాడి రెండు నెలలే యైనవి. అకటా ! ఇందఱు దిగనాడి నేనెట్లు దూఁకుదును? తామసంతోషము చెందినందుల కిదియాఫలము !

ముని:— ఓరీ ! భయపడకుము. నీకట్టి కొఱత యేమియును గలుగదులెమ్ము. అని యింతలోఁ దనజపము విచ్ఛిన్నమైనదని తలఁచికొని యక్షమాలిక బిరబిరఁ ద్రిప్పుకొనుచు జపించుచుండెను.

ద్వారపాలకుఁడు దనలోఁ నిట్లని తలఁచెను. "తిన్నఁగా ముచ్చ
టలు చెప్పుచు నెట్లో కొంతకాలము పుచ్చితిని గాని రాజు
గారు నిద్రలేచి మొదలుచున్న జాడయేమియుఁ గన్పట్టలేదు.
ఇతఁడిప్పుడు లోనఁ జొచ్చెనా నాకాపదరాక తప్పదు. ఎట్లో
యీతనివలన నభయము పొందితిని. ఇంక నీతఁడు నను శపింపఁ
బూనఁడు, కాఁబట్టి యీతనిం గొంతసేపెట్టి రచ్చగావించెదను
అది వినినమైన రాజుగారు వచ్చినచో నాసుప్పఁపప్పను." అని
తలఁచుచుండఁగా:

ముని:—ఓరీ ! నీకభయ మొసఁగితిని. అంబరతలమునుండి
యింద్రుని యావజ్రాయుధముపడినను నీకుహాని కలుగదు
ఇది నావరము. ఇంక దారి విడువుము.

ద్వారపాలకుఁ డాతని కడ్డముగా నిలిచి; "స్వామీ !
మీమాటలవలన మీ ప్రభావ మింకొకటికూడ జ్ఞప్తికివచ్చు
చున్నది."

ముని:—ఏమిది ? లోనికిఁ బోనీక కథలతోఁ బ్రొద్దుపుచ్చు
చున్నావు.

ద్వార:—నామనవి యించుక వినుఁడు. అంబరతలమునుండి
యనుటచే నంబరీషుఁడు జ్ఞప్తికి వచ్చెను. అతనియొద్దఁగదా తమ
ప్రభావము వెల్లడియైనది! అప్పుడుగదా తాము త్రిలోకములు
సంచరించి వచ్చితిరి !

ముని:—పలువా ! ఏ ఘోరకృత్యము చేసెదవని కదా భావించితిని ! తుదకు వక్రగతిగా తిరుగుటయా సంభవించెను.

ద్వార:—వక్రగతిగా, కాదు కాదు. చక్రగతిగా దిక్కులు దిక్కులు దిరుగుట సంభవించెను.

ముని:—పలుగాకీ ! నోరుమూయుము. ఈ దండములో సీతల పగుల్తుమగాని యభయమిచ్చుటచే నిన్నొక యిక్కట్టు పకుఁ బెట్టుట సరికాదని యూరకుండవలసి వచ్చుచున్నది. లేకుండిన నిన్ను సీఱుచేసియుండనా ?

అని ప్రతిజ్ఞవాఁడు జుఱజుఱఁజూచుచు భూమిని పాదముతోఁ దన్నుచు హుంకరించుచుండెను. అప్పుడే దాని యాలోచించుచుండిన రాజీశబ్దము విని వెలికి వచ్చెను. జరిగిన విషయమును గనిపెట్టెను. దుర్వాసునకు ప్రణామము లాచరించి లోనికిం దోడ్కొనిచనెను.

రెండవ అధ్యాయము.

కుంతి

కుంతిభోజుఁడు దూర్వాసుని లోనికిఁ బిలుచుకొనిపోయి యున్నతమయిన యొక యాసనమునఁ గూర్చుండఁ బెట్టి యర్ఘ్యపాద్యము లున్నగువానిచే నర్పించి, తక్కువసత్కారము

లన్నియుఁ విధ్యుక్తముగాఁ గావించెను. అంత బడలిక దీఱ యాముని కుంతిభోజునిఁ జూచి; "రాజా! అనామయమా! నీ ప్రజలకెల్ల క్షేమమే? బంధుమిత్రాదులెల్లరు సుఖులే!" యని యడిగెను, అంత రాజు; "మీవంటి మహాత్ముల యనుగ్రహమున నందఱము, కుశలముగనే యున్నారము, మేము ధన్యులమయితిమి. ఇందులకు నాభాగ్యము మీ రాగమనమే యగుచున్నది, అధన్యులకు మీ [illegible] [illegible]?" యని యనేకవిధములఁ [illegible]ంచెను. అప్పటికి నా మునీంద్రుని మోము వికసింపక ముకుళితమై వాడి యుండుటఁగాంచి ద్వారపాలుని యవినయమందులకుఁ గారణమయి యుండ నోపునని భావించి, "దేవా! శమదమాది గుణవిశిష్టులగు మీబోటివారి గుణములు విద్యావంతుల కొకవేళఁ దెలిసినఁ దెలియ వచ్చునుగాని మూఢులకుఁ గుత్సితులకు, నీచఁపుఁ గొల్వు గొలుచువారి కది తెలియదనుట చెప్పవలయునే? అట్టి యల్పులు భూషించినను దూషించినను మహాత్ముల మహిమ కొకహెచ్చుగాని తగ్గుగాని రాఁబోదు. కుక్క మొఱిగినం తన కొండకేమని గొఱఁత గల్గునే? నీచుల పలుకులు తలఁచుట కూడఁ [illegible]మనియే యెంచెదను. ఇది తమకుఁ దెలియనిదే" అనియాడి అతనికి ద్వారమునొద్దఁ గల్గిన మనఃకాలుష్యమది న్నఁగాఁ దొలఁగఁబుచ్చి ముఖమునందుఁ బ్రసన్నభావము

గర్జించెను. మఱియు నా భూకాంతుఁడు చిన్నని మాటలఁ జెక్కుల నా మునికి మఱింత వికాసము పుట్టించి; "ఋషివర్యా మీ రాకకుఁ గారణమేమి? మా సుకృత పరిపాకమునకై వేఱు కారణమున్న సెలవిండు; నిస్సంగులగు మీకుఁ గోరఁదగిన వలసిన దొక్కటియు లేదుగాని మాబోంట్లఁ గృతార్థులఁ జేయుటకై కోరికయను నెపమిడుకొని కార్యమెద్దేని జరిపించుకొనుచుందురు. అట్లు నను ధన్యుంగావింప నెద్దేనిఁ గోరనుండిన నానతిండు," అని యడిగెను.

ముని, రాజుమాటల పొంకమునకుఁ దలయూఁచి, మెచ్చి, "నీవు నిత్యము వేలకొలఁది నిండుకొని వచ్చు బ్రాహ్మణులకు, నతిథులకుఁ, దిక్కులేని యనాథులకు నవ్వారిగా మిష్టమృష్టాన్నముల నిడి పూజించుచు నాదరించుచు నుండువాఁడవఁట. అన్ని దిక్కుల వ్యాపించి యుండు నీ కీర్తియే నన్నుఁ బట్టి లాగి యిటకుఁ దెచ్చినది. మంచి యన్నదాతవు. కావున నీయింటఁ గొన్నినాళ్లుండి పోదమని నా తలంపు. నన్నుండమందువే? లేక వలదనిన మఱియొక" అనునంతలో రాజు; "అట్లానతియ్యెదరేమి? లక్ష్మి తనంతన వచ్చెదననిన వలదని పొమ్మా లొడ్డు వెఱ్ఱులును గలరా? మీరిచ్చటనే యిచ్చవచ్చినట్లుండి నన్ననుగ్రహింప వలయు నని ప్రార్థించుచున్నాఁడ" ననెను. దుర్వాసుఁడు "సరి. దీర్ఘాయుష్మాన్భవ. ధనకనకవస్తు వాహన

సమృద్ధిరస్తు. పుత్త్రపౌత్త్రాభివృద్ధిరస్తు" అనిదీవింపరాజులోపలనుండి పట్టజాలక వచ్చిన నవ్వును పెదవులలోనే యణఁచుకొనుచు ; "మహాత్మా ! నాకుఁ బుత్త్రులే లేరు. పౌత్త్రు లెక్కడనుండి రాఁగలరు? మొన్న మొన్ననే కదా నా మేనమామ కొడుకును యాదవరాజునగు శూరుని జ్యేష్ఠ తనయయు, వసుదేవుని తోఁబుట్టువునగు పృథయను దానిం దెచ్చి పెంచికొంటిని ! అయినను మహాత్ములు దా మాడినమాట దప్పునా? "యనెను. దుర్వాసుఁడు కొంతసేపు చింతించి "తప్పదు. దాని కడుపున నే దిక్పాలురవంటి పుత్త్రులు పుట్టఁగలరు చుమీ ! వారి భూభారమునుగూడ దీర్తురుపో." యనెను, అంత రాజు ; "అమ్మడి" నాగృహమునకుఁ బ్రతిదినమును వచ్చుచుండు మునులకుఁ బ్రాహ్మణులకు నన్నపానాదు లొసఁగి యుపచరించు చుండును. అట్లు మహాత్ముల కెడతెగక శుశ్రూషచేసి వారిఁ గన్న యాచిన్నారిబిడ్డ వారి దీవన లందిన యాపవిత్త్రురాలు దమకు సేవ సేయఁగల"దనెను. అంత నంతఃపురములోని కరిగి కంచుకినిఁ బిలిచి, ఓరీ ! కుంతిని బిలుచుకొనిర"మ్మని యాజ్ఞ చేసెను, వాఁడు, "కన్యాంతఃపురమున నుండియా" యని యడుగ రాజు వానింగాంచి ; "దాని కచ్చటనుండు నంతటి తీరిక యెచ్చటిది? అన్నదానశాల యందే దాని కెప్పుడును బనిపాటులుండునుగదా ?" యనెను, వాఁడట్లే యచ్చట

కాని కుంతిని బిలువగా నాబిడ తోడనే తండ్రి కడకరు దెంచెను.

ఆబిడ సౌందర్య వైభవమేమని చెప్పవచ్చును? ఆ ముద్దు మోము పున్నమచంద్రుని బోలుచుండెను. ఆ వాలుగన్నులు విరివిరియై తామర రేకుల బోలుచుండెను. ఆయుబ్బు చెక్కిళులు మెఱుగు టద్దమున కీడగుచుండెను, ఆ బాహువులు లతల వలె సుకుమారముగానుండెను, ఆబిడమూర్తీభవించిన సౌందర్యరాశియో, మెఱుంగుపెట్టిన మోహనాస్త్రమో యనునట్లు ముద్దుగులుకుచుండెను.

ఆబిడవచ్చి తండ్రికి నమస్కరించి యాజకునితో నొదిగినిలుచుండెను. రాజు నామెను గాంచియొక్క ప్రక్కకొదిగి మెల్లగా: "పుత్రీ! ఒక కార్యము కావలసియున్నది, అదిమహా కష్టమేకాని తీర్చినయెడల మీవుల శ్రేయస్కరమగును. దుర్వాస మహర్షియని వినియుందువు గదా" యనెను. అంత కుంతి, "పేరుమాత్రము వినియున్నానుగాని, చూచియెఱుంగను. మహా కోపియగు నాతనిపేరు విన్నంతనె నెట్టివాడును భయపడునంట కాదా!" యనెను. రాజు; "అతండు మనయింట గొంతకాలముం డునంట. అందులకేను సమ్మతించితిని, పెద్దలను మనము పిలుచుట కుమాలు వారు తమంతన వచ్చినప్పుడు వలదనవచ్చునా? అట్లు వారి యునికికి సమ్మతించుటయు నిన్ను నమ్మియేసుమీ! నీవు

పసితనమునుండియు నతిథుల సత్కరించి యారితేఱియున్న దానవు మిక్కిలి గుణవంతురాలవు. గురువుల యందును బ్రాహ్మణులయందును పెద్దలయందును మహాభక్తిగలదానవు. కాఁబట్టి నీవే యీ మహర్షికి వలయు నుపచారములు సేయనేర్తువు,అతఁడేది యడిగినను లేదనకనే నవ్వుచు నిచ్చినఁజాలును, ఈ బ్రాహ్మణుడు తేజస్సునకుఁ బుట్టినిల్లు, తపస్సునకునిధి. అట్టివారి యనుగ్రహముననే జగములు బ్రదుకుచున్నవి. ఎంత కాయుటయు. వారి కోపమునను వారి యను ప్రసాదమునవే. వారి పరాభవించినను నాశము జేసికొనును దాల జంఘుఁడు నేమయినో తెలియునే? అందు నీవుపచరింపవలసిన యతఁడు బ్రాహ్మణులందుఁ గలమిన్న. తపమును తేజస్సును నతని స్వరూపములు. కనుక మిక్కిలి యెచ్చరికతోడ, నతనిని గొలువవలయును. ఉగ్రుఁడని భయమా?" అనెను.

కుంతి:—భయమేల? మనపనియందు దోషముగాని మనస్సునఁ గలుషముగాని లేకుండినఁ జాలును, ఎప్పటికైనఁ గారణమువలదా తనగుణము చూపుటకు! అకారణముగాఁ గోపించిన నాతని తపస్సు మాయును గదా!

అందులకు రాజు మెచ్చి;

"తల్లీ! నీ తెలివితేటలు చిన్నని నడవడికయు జల్లని మనసు నెంతయుఁ గొనియాడఁ దగినది, నీవు పుట్టినది యదు

కాలము, జెఱిఁగినది నాయింటనుగదా! ఇట్లుభయకులములకుఁ దగు గుణము లమరియున్నవి, కల్యాణీ! తక్కువ కులమునఁ బుట్టిన పడఁతులను గష్టపడి యెన్నికట్టుబాటులఁ బెట్టినను బసి దనమువలనఁ దప్పి నడవక మానరు. నీవో! గొప్పకులమునఁ బుట్టి పెరిఁగిన దానవు. పసిదానవయ్యు నెవ్వరి యెడలను దప్పినడువవు. చుట్టపక్కములందును. జెలులందును; భృత్యు లయందును, దల్లిదండ్రులగు మాయందును మనవారను బుద్ధిని బట్టికాని, చనవునుబట్టికాని, యలక్ష్యముచేసితప్పినడిచినదిలేదు. కాఁబట్టి మనరాజ్యమునందుఁ గాని, రాజధానియందుఁ గాని నీయెడసంతసింపని వారొక్కరును గల్గరు. కులమునకుం దగు రూపును నాకొకటి దయుయున్నది. రూపునకుం దగులక్షణము లెల్ల నమరియున్నవి. ఇది యరుదు. ఇట్టి చక్కఁదనాల కుప్పను గారాబు కూఁతును నిన్నా మునికి శుశ్రూష సేయుటకుఁ బంపుట యెట్లని శోకభయములు పీడించుచున్నవి. కాని నీభక్తి వినయాదిగుణములే శోకమును పోకార్చుచున్నవి నీతెలివియు, మెలఁకువయు నాభయమును చాలఁగించుచున్నవి. నీవు పెద్దలఁ బెక్కురఁ గొలిచి పనుపడి యుండుటయు వారివలన నీవుపొంది యున్న యాశీర్వచన పరంపరలు నిన్నీపనికి నియమింపవచ్చు నని నన్ను త్సాహపఱుచుచున్నవి. ఏమనెదవు?" వనెను.

కుంతి:—తండ్రీ! చింతింపవలదు. నాకు నిరంతరము బ్రాహ్మణసేవ సేయుచుండవలయునను కోరికగలదు. అది దైవికముగాఁ జూఁకివచ్చినది. మఱియందులకుఁదోడు మీయాజ్ఞయు నైనఁగూడెను. నాకిది యత్యంతప్రియముగ నున్నది. నా మహాభాగ్యవిశేషము కతమున నిన్నియుఁ గూడియుండ నేన ట్లాని నొల్లకుందునే?

రాజు:—నీ బుద్ధియుఁ బెద్దఱికమును దెలిసియేకదా నిష్ఠవంటి యామునికి శుశ్రూష సేయుభారము నీపైఁ బెట్టియుంటిని. దర్పాహంకారముల దూరముగల్గ త్యజింపవలయును. అప్పుడు మూఁడు కన్నులుగలవానికేని నిన్నుఁ గన్నెత్తిచూడఁ దరముగాదు. ఇది సకలకార్యసిద్ధికి మూలమగును. ఇట్లారెంటిం బరిగవిడిచి యామునిని యెప్పుడుగాని యెచ్చోటఁగాని యేవిధముననైనను నెది కోరినను దానిం గొఱకొఱలాడక చుఱచుఱఁజూడక విసుఁగులేక వ్యసనపడక లోపలను వెలుపలను బరిపూర్ణభక్తికల్గి తోడన చేయుచురమ్ము. మునియలుకకును వెడపలుకులకు వ్యవధిముగలుగదు. అట్లే వారి యనుగ్రహమునకు మృదూక్తులకును నెడముండదు కాఁబట్టి నీవు కృతార్థురాలవగుదువు. నీవలన నాకులమునకును గీర్తిగల్గఁగలదు. ఈబరువు నీపయిఁ బెట్టుచున్నాఁడను.

[illegible]—[illegible]త్రీ! ఊరకె సంశయింపనేల? బ్రాహ్మణుల [illegible] కోపము పెట్టినను నే నెఱుంగుదును. వారియందెప్పు డేవిధి మెలఁగవలయునను నాకు జన్మముతోడఁ బుట్టినవి యగును. చిన్ననాటినుండియు నే నీవిషయమున బమపడి యున్నాను. [illegible] వచ్చినను నలయుపరిచర్య జరిపి [illegible] కోపముగల్గనీక మెలఁగెదను. ఈ భారము నాపైనిడి నెమ్మదిగా నుండుఁడు.

[illegible]యొక్క చలింపని ధైర్యమునకు దిట్టతనము [illegible] మెచ్చి [illegible] దోడ్కొనిపోయి; “మునిచంద్రమా! [illegible] త్రిక. తమకు సేవసేయ నేర్తునని [illegible] బూని [illegible] తిరశక్తి యెఱుఁగదు. ఎంత నేర్చినను పసిదే కదా! పుట్టినదిగి నాచే నొకతిట్టును బడియెఱుఁగదు. ముద్దులతోడనే పెరుఁగుచు వచ్చెను. మా ప్రాణములెల్ల దీనియందే నిలిచియున్నవి. కాఁబట్టి తెలియక తప్పుగా నడచి కొనెనా [illegible] బుద్ధులనేర్పి పరిచర్య చేయించుకొనవలెను. బాలురు స్త్రీలు వృద్ధులు తెలిసి తప్పు చేసినను నెట్టి వారును దానిఁ దప్పుగాఁ బాటింపరు. ఇఁకమీబోటి శమదమ సంపన్నులమాట చెప్పనేల?” యని యాబిడనాతని కప్పగించె. అతఁడు చంద్రకిరణములవలె, హంసముల వలెను తెల్లనైన యొకమేలి సౌధము మహర్షికి నివాసముగా నేర్పఱిచెను

అందగ్నిహోత్ర శాలలో నాతనికి స్థానమొసఁగి యుంచ మమన్నైను. మఱియు నామునికిష్టమైన యన్నపానాది ద్రవ్య ముల నమకట్టించి కుంతినిఁ జూచి; "మాయందఱ ప్రాణములు నీ యఱచేతన యున్నవి. మునిని మెప్పించితేని ముల్లోకములు నీయవి. నొప్పించితివా యవ్వలిగతి చెప్పనేల ?"

అని హెచ్చరించి మునివలన సెలవు పుచ్చుకొని నగరు లోనికిఁ బోయెను.

మూఁడవ యధ్యాయము.

పరిచర్య

ఆ మహా సౌధమునందుఁ బృథ యామునికిఁ బరిచర్యలు చేయసాగెను. ఇంతవఱకు మునులకును బ్రాహ్మణులకును బరి చర్యలుచేసి యలవాటుపడియున్నది గాన నాముని కేవేళ నేవేళ నేది కావలయునో దాని నతఁడు తలఁచుకొనకమునుపే యాయిత్తమైయుంచును. అతఁడు పలువిచ్చి చెప్పి తెప్పించు కొనిన దేనియు నంతగాఁ గానరాదు. ఇతని కేమి కావలయు నను మాట కుంతికిఁ దెలిసినంత యతని కే తెలియదనిన యతిశయోక్తి గాదు. ఇది బాల్యమునందలి యభ్యాస ప్రభావము. ఉగ్గుపాలతో మాఱిపోసినది యూపిరి యుండువఱకును విడువఁజాలదు కదా

నొసంగి మంచిదైనదాని మేలు నిచ్చుచుండును. అప్పటప్పు
డిటు క్రొత్తక్రొత్తగా వింతవింత రుచులు పుట్టుచున్న కాదు
గూరలును, గూడు గూరలకంటె చెక్కుడైన భక్తివిషయము
లును, భక్తి విషయములకంటె నధికమగు పలుకుల మేలింపు
ను మఱి మఱి క్రొత్తవిగా నుండెను. అన్నియు వైనమువలె
వలె నుపచారములు. అపచారమో యెంత పరిశీలించినను
గోచరముగుటలేదు. ఒక్కొక్క యుపచారమునందును బనికత్తె
యొక్క భయమును, శిష్యురాలివలె భక్తియుఁ, బుత్త్రికవలె
గౌరవమును, సహోదరివలెఁ బ్రేమయు, నగపడుచుండును.

మఱి మహాత్మురాలి శ్రద్ధయు దాని వృద్ధినొందించుబుద్ధి
యు, [illegible] స్వాభావికమగు శ్రద్ధయు, దానికంటెఁ
హెచ్చుచుండఁగ నెక్కుడైన భక్తివృద్ధియు నెఱుగునకై తన
వెతగునకై తను బుష్టియుఁ దుష్టియుఁ గల్గించుచుండఁగా ఋషి
శ్రేష్ఠునకుఁ జెప్పవలయునా? ఋషిమాత్రుఁడుగాఁడే కానిమ్ము,
అగ్నిహోత్రముఁ బట్టినవాఁడే యగుఁగాక. బడబాగ్నియైన
నమృత మహాసముద్రమునఁ బడి యేమిచేయగలదు?

అతఁడా ముద్దియ మనశ్శుద్ధిని, భక్తిపరిపాకమును, సాత్త్విక
మును దెలియఁగోరి పరిపరి విధముల నాబిడను బరీక్షింప
సాగెనుగాని యాబిడయందుఁ గొంచెమేనియుఁ బొరపాటుగానఁ
బడదయ్యెను. ఒకనాఁ డతఁడూరకయ యున్నట్టుండి మండి

పలుకు; "ఓసీ! నీ పేరేమి? చెప్పుము. ఏల యూరకున్నావు?"
అని తన మాటయే కాని యొరుల మాటలాడుటకు నెడ
మియ్యకయే యామె తన ప్రశ్న కుత్తర మీలేదను నెప
మాపైఁ బెట్టి కోపించుచుండెను. కుంతియంత వినయమున
"నాపేరుకుంతి" యనెను. ముని, "ఇస్సీ! నీపేరు పృథయని
మీతండ్రి నిర్ణయించి యుండెను. నాయన [illegible] పెట్టినపేరును
టకుఁ [illegible]" అని
యనెను [illegible]: "మహాత్మా! పుట్టినింటివారు పృథయని
పేరుపెట్టిరి. పెంచినతండ్రి 'కుంతి' యని తన పేరు నందలి
కొంత భాగము నెత్తి నాకుఁ జేర్చెను. కాబట్టియే
నేనాలాగునఁ జెప్పితి" యనెను. ముని; "ఏమేమి? పదినెలలు
మోసికన్నవారు పెట్టిన పేరు కడప దాటకుండనె పోవుటయా?
నడుమఁ బెట్టినదే ముఖ్యమా" యనఁగుంతి; "తమ కేది
చిత్తమో సెలవిచ్చినదానినే గ్రహించెద" యనెను. ముని,
కుంతియనుటకు నీతండ్రి చిత్తము. పృథయనుటకు నాచిత్తమా?
ఎప్పుడు కడుపు నెవరున్నారో యప్పటికి వారి చిత్తముగా
బోలు! ఎత్తువారిచేతిబిడ్డవా? జిత్తులమారీ!" యనెను.
కుంతి; "మహాత్మా! పుట్టినింటివారు పూజ్యులు. అంతకంటెఁ
బెంచినయింటివారు పూజ్యతరులు. తాము పూజ్యతములు,
పూజ్యతముల చిత్తమే మాబోంట్లకుఁ బ్రమాణ" మని

సన్న్యాసిఁ జెప్పఁగా ఋషి యామెబుద్ధి పటిమకును మాట [illegible]కును మిక్కిలి యాశ్చర్యపడెను.

మఱియొకనాఁడు దుర్వాసుఁడు కుంతివడ్డించిన సరసమృదు పదార్థములఁ దినుచుండెను. కుంతి మఱుఁగున నేయుండి యాతని కేమి కావలయునోయని రెప్పవేయక మఱియొకటి తలఁపక యాతనినే చూచుచుండెను. అతఁడంతయు భుజించి లేవఁబోవు సమయమున సైంధవము, సైంధవము త్వరగాఁ బోవలయునని పెద్దగా పలికెను. కుంతియదరిపడి యుప్పుకావలయునని యాడెనని తలఁచుకొని పరుబరుఁబోయి దానిందెచ్చి వడ్డింపఁ బోయెను. అది చూచి మునిమండిపడి పండ్లు పటపటఁ గొఱుకుచు ;

“ఓసీ! భుజించి చేయిగడుగుకొనఁ బోవునపుడా యుప్పు దెచ్చెదవు? దప్పిపుట్టి నీరుద్రావింపనా తలంచితివి? కడు పుబ్బించి చంపనాయెంచితివి? హా! ఘాతుకురాలా! పాపాత్మురాలా! ఎంతకొడిగట్టితివి? పెద్దలనుగొల్చి తేఱుగడనందితి వని నీతండ్రిచేతులు ద్రిప్పిత్రిప్పి బట్టువానివలె నిన్నుఁబొగడె నుగా! నీతేరుగడ యటుండ వారు గడతేఱెదరికాఁబోలు! ఇఁక నన్నుఁ గడతేర్పఁ గంకణముపూనితివా? సైంధవమునకు నర్థము దెలియదా?”

ఇంతలోఁ [illegible] నుంచి యశ్వమెక్కి [illegible] [illegible]. [illegible] మఱి [illegible] [illegible];

"ఓసీ! [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] తెలిచితివా? [illegible] [illegible]. [illegible] ముక్క నున్నదికదా! దానినీరని తెలియుటలేదా! కానీ! ఇంతకావరమా! ఇంతపొగరమా! అని పెద్దయెలుఁగున నఱచి బిరబిర నెక్కడికో పోయి మరలివచ్చెను.

ఇట్లింతఁ డెన్ని పనులు పెట్టి యలయించినను, నాఁడెన్ని పరుషములాడి కలంచినను నాగుణవతి మనసున విసుఁగు గొనదు. ముఖమునఁ వికాసము తప్పదు. రేపువచ్చెదనని పోయి యర్ధరాత్రమున వచ్చును. మాపువత్తునని నమ్మించి మట్ట మధ్యాహ్నమునకే తోఁచును. పోయెదనని చెప్పి మఱుఁగై తటాలున మరలివచ్చును. నిలిచెదనని చెప్పిపరుండి దబ్బున వెడలి పోవును. తెమ్మని యడిగి వల దనును, వలదని చెప్పి తెమ్మనును. ఎట్లుచేసిన నేమి? ఆనిత్య నిర్మలాంతరంగకు, ఆనిరుప

సా భక్తి యుతకు మొగమునం బొకరేకయు ముడుంగడు నొం...నప్పు డెడపనిడి సుండడు. పలుకు తియ్యదనపు తగ్గదు ప్రసన్నముఖాననము వీడదు. కోపమో తాపమో మతిభేదమో మోహమో యొక్కింటికిని దర్పమును దంభమును ద్వేషమును గదా ఘనాంతరంగులు! ఈమూండింటిని విడిచి యెప్పుడు ముత్తె మాంచి తెసు... నా మొచ్చి త్తమునకును, నాచిత్తమునందలి మహా స్త్రీ ప్రాతిభక్తి రసమునకును ఎలంతగాని కలంతగాని గల్గుచున్నా? ఎలసి సొలసినది మునియే. కాకేమి? అట్టి మిక్కిలి కష్టతరములగు పరీక్ష లెల్ల రామబాణములవంటివి. అవియమోఘములు అపునీతిప్పినా ప్రయోగించినవాని మీరాంచి నే పరికమాసము.

ఇట్లొక సంవత్సరకాలము జరిగెను. నానాండు జరుగుచు దంతయు నప్పుడప్పుడు దంఢ్రి వచ్చి యడుగంగా నతనికిం జెప్పి మెప్పును సంతోషమును గలిగించు చుండెను. అంత దుర్వా సుండు గుంతి పరిచర్యకు మెచ్చి;

"కుంతీ! నీశుశ్రూషకు నేనుమిక్కిలి సంతోషించితిని. నీకీలోకము నందలి మనుష్యులు పొందరాని వరముల నైన నడుగుము. ఇచ్చెదను. దానిచేత నీవు మిక్కిలి కీర్తినిబొంది తక్కిన కాంతలం గ్రిందుపఱుపంగలవు," అనెను. అంతంగుంతి దేవరకు నేను దెలిసియో తెలియకయో యించుక యుప

చరించినవది శుశ్రూషయనఁదగునే? దానికినేఁగోరిన ఫలంబు
బహుమానానుగ్రహమును మాతండ్రిగారి యానందమునగు.
ఈరెంటిని మించినదేమున్నది? ఇంతియచాలు. చరితార్థ
నయితి" ననెను. దానికి దూర్వాసుఁడు సమ్మతింపక; యిట్లనెను.
"నీయట్టిగుణవతికి సరియగునదియే కాని నాబోటివాని కిది
ధర్మము కాదు. తృప్తియుఁ జేయదు. ఇదిగో నేనొక మహామంత్ర
ముపదేశించెదను. మాటాడక పుచ్చుకొనుము. దీనిచే నీవే
దేవత నాహ్వానము చేసెదవో యాదేవత నీవశమున నుండఁ
గలఁడు. ఆదేవత యెంతకష్టమైనను గాకున్న నీమంత్రము
నకుఁ గట్టుబడి నీకు భృత్యుఁడయి యుండక తీఱదు సుమీ!"
యనెను. అతఁడు చండకోపుఁడుగాన వలదనిన నేమనునో
యని భయపడి కుంతి; "మహాప్రసాద" మనెను. అతఁ
డథర్వశిరమ్మనమన్న మంత్రమా బిడకు విధ్యుక్తముగా నుప
దేశించెను, ఆమంత్రము సామాన్య మగునది కాదు. అది
భూభారపిశాచమున కుచ్చాటన మంత్రము, భూపాలకుల
క్షయమున కభిచారతంత్రము. భారతయుద్ధరంగ నిర్మాణము
నకు వాస్తు యంత్రము. కౌరవ నాటకరంగమునకు ద్వార
ప్రవేశము. ఓంకారసహితమగు నామంత్ర రాజమాబిడ కుప
దేశించి దుర్వాసమునీంద్రుఁడు కుంతిభోజు నాశీర్వదించి
వీడ్కొని వెడలెను.

నాల్గవ యధ్యాయము.

పుత్త్రజననము.

ఒకనాఁటియుదయమున స్నానము చేయుటకై దాసికూఁతును దోడుకొని దాపుననున్న యశ్వనదికిఁ బోయెను. అప్పుడు తూరుపు తెల్లవాఱుచుండెను. క్రమముగ దూరమునుండి మంచు వలెఁ జలువైన వెలుతురు వ్యాపించి పడమటి దిక్కునందలి పర్వతాగ్రములందుఁ బొంచియుండు చీఁకట్లను దఱుముకొని పోవుచుండెను. కోలకోలమని పక్షులధ్వనులును, నిద్రలేచు చున్న జనుల కిలకిలములును వినఁబడుచుండెను. కుంతి యానది యందు జలకమాడి శుచియై వెలపొడుగు చీరఁగట్టుకొని, సొమ్ములుదొడిగికొని, కురుల దాది యార్చుచుండఁగా నొక చలువ రాతి గట్టుపైని గూర్చుండెను.

అప్పుడు దాపలిపొదరిండ్ల దట్టముగాఁ బూచియున్న పూవులతావులు గుమగుమయని గుబాళించుచుండెను. చెట్ల యందలి చిలుకలును గోకిలలును జేయుచున్న యవ్యక్తమధుర ధ్వనులు, నప్పుడే వికసించుమల్లెల మకరందపానము జేయవచ్చు చుండు తుమ్మెదల ఝుంకారములును గూడియెంతో కర్ణ పర్వము గావించుచుండెను. అందందు దట్టములుగా నాకుజొంప ములును, వాని నడుమ సూక్ష్మముగా వ్యాపించియున్న వెలుఁ

గుహఁ దానినుండి తప్పనెంచినటులున్న సన్నమబ్బువంటి కను చీకట్లను దవ్వుదవ్వులఁగన్పట్టు పర్వతములనుండి జలజల ప్రవహించుచు వానకియ్యఁడుఁబడు సెలయేళ్ల తుంపరలతోఁ గూడి చల్లనై వీచుచున్న పిల్లగాడ్పులునుగూడి యాప్రదే శముమాచుట కెంతో మనోజ్ఞమై యెట్టివారి మనస్సునకును రసోల్లాసము గల్గించుచుండెను. దానఁగల్గిన చిత్తవృత్తి కుంతి యొక్క ముద్దుచెక్కుల మీఁద [illegible] చుండెను.

అస్వాభావిక మానసము మిక్కిలి యుత్సాహ యుక్త ముగా నుండెను. ఆమె కఁలార్వరూపము వైచికొని నుదుటఁ గస్తూరితిలక మిడికొని దాదికూఁతు రప్పుడే కోసి, తెచ్చిన పూవులలోఁ గొన్ని కురులం దుంచుకొనెను. అప్పటి యామె యాకారము గాంచిన వికసించుచున్న తామరనుండి వెలువడిన లక్ష్మీదేవి లాగునను, రూపొందిన రతీదేవి మాడ్కిని గోచరించు చుండెను. అంత నా బిడదాది కూఁతుచేతిపైఁ జేయివైచికొని యుల్లాసముల్లమునఁ జల్లవింప నేమో ముచ్చట లాడుచుఁ గన్యాంతఃపురమునకు బయలుదేఱెను. అపుడు దాదికూఁతు “రాణ్యా..! నేఁ డేమో నీ ముఖము కళకళ లాడుచున్నది. తోడనే పెండ్లియగుఁ గాఁబోలు!” ననెను. కుంతి; “ఔనౌను భర్తయెవ్వఁ డగునదియు నింకనిర్ధారణ కాలేదు పెండ్లి

మాత్రమునకు మిన్నది. పుత్రుల గలిగించు మంత్రమ్మే యుపదేశించెను
నా బాలు! ఓహో! నేను నీ కింత మెల్లిక్కవైతి నే!" యని
యింటమే కోపము నానెను. ఆ పెరిగామున కదిగ్గ్లోర
దూరమున నెవరో కొందరు మాటలాడుచుండిరి. వారిలో
మాటవెంబడిని 'సుపుత్రప్రాప్తిరస్తు' అని యొకనాడకని
వినిపించబడెను. అంతదాది కూతురు; "వింటివే యీయుప
త్రులి! నీకుఁ గొమరుఁ బుట్టునుపో!" యనఁగుంతి నవ్వి;
"ఈ మంత్రములకు మామిడికాయలు రాలునే?" యనెను.
దాదికూతురు: "చక్కగా సెలవిచ్చినావు. దూర్వాసుఁ
డిచ్చిన మంత్రమును జపించుము. దానిచేతనైనఁ గోవాడినట్లు
మామిడికాయలు రాలవేమో చూతము." అనఁగుంతి; మామిడి
కాయలు రాల్చుకొనుట కానేను మంత్రము గ్రహించినది."
అని నవ్వుచునే హాస్యమునకు వచ్చియుండు వెలపొడవగు
నొకశయ్యపై హాయిగఁగూర్చుచుండెను.

అపుడు దయగిరి శిఖరమున బాలసూర్య బింబము కెంపారు
రుచినొప్పుచుండెను. దానిని జూడఁగా కుంతి మనస్సున సొంపు
రెండింతలాయెను. ఆ బిడ మనస్సువిరిసిన తామరపూవు పోలె
నల్ల నల్లన నాడుచుండెను. ఆమె మనస్సును జూపును నానందము
కెంజాయచే రంజిల్లుచున్న యా బింబమునందే గట్టిగాఁజిక్కి
యుండెను. బింబమునందలి రూపము వేంద్రముతో సుందర

యాహ్లాదకరముగా గోచరించుచుండెను. అట్లామె చూచు
చుండఁగా నామెకు దివ్యదృష్టికలిగెను. దాని మూలమున
నాబింబమున బంగారుకవచము దాల్చి దివ్యకుండలములచే
నలంకృతమైన యాదేవుఁడు చక్కఁగాఁగనఁబడసాగెను. అందుల
కామె యెంతో వేడుక నొందెను. దాన దుర్వాసుని మంత్రము
దలఁచికొని; "మునియో కరుణించి నాకు మంత్ర ముపదేశిం
చెను గాని దానిమహిమ నొక్కనాఁడైనఁ జూచిన దానను
గాను. ఇదిగో సూర్యుఁడెంతో రమణీయముగాఁ బ్రకాశించు
చున్నాఁడు. ఇతనివలే సహజకవచ కుండలములుగల పుత్త్రుఁడు
గావలయునని కోరెదను గాక." అనిఇట్లు తలఁచినంతనే ప్రాణా
యామముచేసి మంత్రము జపించెను.

అంత నా బింబమునుండి వ్యక్తి యొకటి మెఱయుచుఁ
గ్రిందికి దిగుచున్నట్లు గోచెరించెను. అది యాబింబమునుండి వీడి
పడిన కాంతిపుంజమా? కాదు కాదు. రానురానది యవయవ
ములతోఁ గూడిన యొక రూపముగానుండెను. పుణ్యా
మంతయు క్షీణింపఁగా భూలోకమునకు వచ్చుచున్న దేవతగాఁ
బోలు! అట్లును తోఁచుటలేదు. అంత నది సహజ కవచకుండ
లాభిరామమై కుంతివంకకే వచ్చుచుండెను, యోగబలమున
వంటియొక మూర్తిని ధరించిన సూర్యుఁడు కానోపును.
అగును, తప్పక సూర్యుఁడే కాఁబట్టియే మెడయందు మూడుఁ



28 ఆబింబమున బంగారు కవచమును దాల్చి, [illegible]

సలంకృతమైన యా దేవుడు [illegible] [illegible].

రేఖలు శంఖమునకువలె శృంగారమై యొప్పఁ, గేయూర
ములు దొడిగి, కిరీటము దాల్చి దిక్కులనెల్ల వెలిఁగించుచు
వచ్చెను. తనయొక్క యస్యమూర్తి యొండగాయుచుండ తాను
కుంతికడకువచ్చి నవ్వుచు నెదుట నిలిచి, భయాశ్చర్యముల
నాక్రాంతయైయున్న యాకన్నెం డయ్యాసి పలుకుల నిట్లనియెను.

“ఓ బాలా! నేనెవ్వఁడనో యని తెలుప వలదు. నీ విప్పుడు
ధ్యానించిన సూర్యుఁడనే. నీ మంత్రబలమున వచ్చితిని, నీ
మదికిఁ బ్రియమైనదానిఁ దప్పక చేసెదను. కల్లలాడను;”
అనెను. కుంతి యాతని తీక్ష్ణని పలుకులఁ దన మనసు గుదుటఁ
బడ నాతని భయభక్తులతోడ నమస్కరించి, “ఓ దేవా!
మీ బోటి దేవతలఁ బిలుచునంతటి పని నా వంటిదానికే
మున్నది? ఉండునదియు లేనిదియు లోకచక్షులరగు మీకుఁ
దెలియదా? పసిదానను నందును దెలివి చాలనిదానను.
మంత్రమనఁగా నొక పెద్దవింతగా నెంచి వేడుకతో జపియిం
చితిని. అది యిట్లు విపరీతమాయెను. ఇంతమాత్రమునకే
యన్నియుఁ దెలిసిన దేవర వేంచేయుట మిక్కిలి చిత్ర
ముగా నున్నది. చూఁడి,” యనెను, సూర్యుఁడు; కుంతీ! వచ్చి
నది నీకు లోఁబడిగాదు, నీమంత్రమునకు వశుఁడనై వచ్చితిని,
మంత్రమన నేమియని తలంచితివి? అది వ్యర్థముగాఁ బోవునే?
అది యీశ్వరాజ్ఞాస్వరూపము, లోకములన్నియు దానికిలోనవ

యాగుదు. లోకములోనివాఁడను నేనును దానికిలోఁబడ
వలసినవాఁడనే.వచ్చినవాఁడను నీ యిష్టము సేయకుండుటదగదు.
కర్మసాక్షిధర్మము తప్పుడుచుమీ." యనెను, అంతగుంతి ;"
మంత్రము భక్తియుక్తముగ బుద్ధిపూర్వముగ జపించినఁ
గదా సిద్ధించుట ! వేడుకకొఱకు నోరు మెదల్చినంతనే యిట్లు
కదలివత్తురే ? నా యజ్ఞానము చూచి, నా బాల్య చాపలము
దెలిసి దయతోఁ బోవ యత్నించవలయును." అనెను. సూర్యుఁడు
"[illegible] నిలుచుట [illegible] విప్రోక్తియగుటయ
లెడవు. వేడుకయని యగ్నిఁ ముట్టినఁ గాలదా ? విషముద్రావిన
జావరా ? భక్తితోడను రక్తితోడను జపించిననే యది ఫల
మిచ్చునని తలఁచితివే ? ఆయా వస్తువులు తమ తమ స్వభావ
గుణములఁ దప్పఁజాలవు. అన్నిటికిని సాక్షినగు నేను దప్పిం
తునే ? సహజ కవచకుండలములఁ గల నావంటి పుత్త్రుని నీవు
గోరితివిగా! ఆ కోర్కె యేల వెలిపుచ్చవైతివి ? పట్టి సమయ
ములం గోర్కెలుగల్గి ఫల సమయమున విడువనేల ?"యనెను.
కుంతి,"దేవా! మంత్రప్రభావము దెలియుటకై కోరికయను నెపము
పెట్టి యీ తారక మనస్సునవెంచితి నంతియ కాని నిజముగా నాకట్టి
వాంఛ యెక్కడిది ? తెలిసి తెలియముల మూలమునఁ
జేసిన తప్పును లోకబాంధవుఁడవగు నీవు మన్నింప కుండిన
నింకెవరు దిక్కు కాఁగలరు ? మఱియు నేనాఁడుపుట్టువు గానఁ

నా స్త్రీత్వము చెఱఁగొట్టి కొంటివా; నాకుమాత్రముకాక యీ రాజ్యమునకు రాజగు నాతండ్రి సుప్రసిద్ధుఁడగు కుంతిభోజునకుఁగూడ నపయశము రాఁగలదు గదా! నాతనికి కళంకము వచ్చునా, దాని మూలమున నా రాజ్యమునకును, మున్ను కీలునందుగదా! నన్ను విడిచి పైన నన్ను మన్నింపరా?" అనుచు కన్నుల నీరు కాల్వలు కట్టి పాఱుచుండ మిక్కిలి ప్రలాపములాడెను. సూర్యుఁడు; "నీవు చెప్పినది నిజమే కాని నీ స్త్రీత్వమెట్లు నష్టమగును? లోకము తెలియని నీ కన్యాత్వము హరించిన లోకమే తలక్రిందు లగును గదా! కావున నామాటలకు సమ్మతింపుము. నీవు తలఁచినట్లు పుత్త్రుఁడు పుట్టియే కన్యవలయునని యుక్తిచెప్పెను. ఆ వివేకమాటలు కొప్పుకయ్యెను. అంత సూర్యుఁడు కోపముగొని; "మంచిమాటలచేఁ జక్కఁబడవా? నన్నెవ్వఁడని తలఁచితివి? ఇట్లు చేయకపోయితివా? నిన్ను మాత్రముకాదు. నీతలిదండ్రులఁగూడ నీఱు చేసెదను, ఇది మనయిద్దఱికే తెలిసిన మర్మమని తలఁచితివా? ఇప్పుడు దప్పించుకొనిన నింక నెవ్వరెఱుఁగలరని యుక్తిపన్నెదవా? ఇది మనకు రహస్య కాని మీఁద నెందఱో హాస్యము సేయుచున్నారు, నీకు దివ్యదృష్టి కలదుగదా? అదిగో చూడు నాకాశమున నింద్రుఁడుమున్నగు దేవతలు నీకుఁ జిక్కియున్న నన్నుఁ జూచి పకపకనవ్వుచున్నారు. మనగుట్టు బట్టబయలయి యున్న"

డగెను, కుంతియు సూర్యుని జూచిన యాదివ్యదృష్టితోడనే దేవ
తలనుగూడఁజూచి లజ్జించి, చేయునదిలేక: "మహాత్మా! ధర్మస్వ
రూపుఁడవు, నీకుఁ దెలియని దేమున్నది? నన్నిప్పటికిఁ దల్లిదండ్రు
లర్హులుగాని కన్యకనగు నే నస్వతంత్రురాలను గదా? ఇది
మాత్రము ధర్మభంగము కాదే?" యనిన సూర్యుఁడు పట్టువిడు
వఁడాయెను. ఇది వినిఁ గుంతి మనసులో; "తపస్సును తేజస్సును
పవిత్రములేకాని యవివాహితనగు [illegible] [illegible]
మహాపాపము గల్గించును. ఒకవేళను నాకీ మంత్రము
దెలియుటచేఁ గదా యింతకొచ్చెను? ఇప్పుడు నేను సమ్మ
తించక పట్టు పట్టితినా యీ దేవునికి నాపైఁ గోప
ముదయించి నాకును నాకులమునకును దల్లిదండ్రులకును హాని
గల్గించును. ఇష్టపడితినా కన్యాత్వము చెడును. ఎట్లు పోయినను
ముప్పుదప్పదు, కనుక యీ దేవుని కోపమునకుఁ బాత్రురాలు
గాక ప్రసాదమునకు గుఱియైతినా యీముప్పునుండి యెట్లేని
దప్పవచ్చునేమో? మఱి గతియేమి?" యని తలంచి తెగువచేసి
యతనితో, "దేవా! కన్యకు బంధువులును పెద్దలును గూడి వరు
నకిచ్చి వివాహము గావించిన యావలఁగాని భార్యఁగాఁజాలదు.
అట్లుండఁ గులశీలములకు భంగకరముగులాగున నిట్లు వేడుక
పల్కుట ధర్మమా? నాకుఁ బయినఁ జుట్టపక్కములు పెక్కు
రున్నారు. వారినడుగక బలవంత పెట్టి నీవేయిట్లు ధర్మమునకు వెలి

వైః నాకన్యాత్వము సెడుట యటుండ లోకవిఖ్యాతమగు నీకీర్తి మలినముగాదా ? ఇది చెప్పవలసి చెప్పితినిగాని నీ వెఱుఁగనిదికాదు. సకలధర్మములును సత్యమునకు లోఁబడినవి గదా? ఇది తగవనియే నీకుఁదోఁచిన నీచిత్తమునకు మాఱాడు దానను గాను, నామీఁది నెట్టినింద పడినను భరించుటకు సాహసము గట్టికొంటిని. ఇట్లని నన్నపవాదముల పాలుసేయుట నీకు ధర్మముగాదు, నన్ను రక్షించుభారము నీయది" యనెను. మహాదుఃఖమున మునుఁగుచు భారము దనపైఁబెట్టి యూరకున్న కుంతిం గాంచి సూర్యుఁడు కరుణించి; "కమలాక్షీ! ధర్మముదప్పి నడతునా ? మఱి నిన్నునడిపింతునా ? నీకన్యాత్వము సెడకుండునట్లుగ వరమిచ్చితిని. లోకనిందయు నీకుఁ గల్గఁజాలదు. నాయనుగ్రహమున సద్యోగర్భమున మత్సమానుఁడు మహాతేజుఁడగు పుత్త్రుఁడు బుట్టఁగలఁడు" అన నంతఁ గుంతి; "దేవా ! నాకుఁ బుత్త్రుఁడు పుట్టిన నీవలెనే కవచకుండలములు గల్గి యతి బలరూపసంపన్నుఁడై యుండును గాదె?", సూర్యుఁడీ మాటలువిని; "అట్లే జనింపగలఁడు, అతని కవచకుండలము లమృతమయములుసుమీ ! ఆకుండలము లదితి నాకొసఁగెను. ఆకవచ మభేద్యమగునది" యనెను. కుంతియు "మహాప్రసాద" మనెను. సూర్యుఁడు "నీకు నావంటి

కుమారుఁ డుదయించును గాక" యని యాకాశమునకుఁ జోడైను.

అంత సూర్యా నను గ్రహమునఁ గుంతి సద్యోగర్భమున నొకసుతుఁగాంచెను. ఆబిడ్డని దేహమునఁ జర్మమువలె నంటి యుండు కవచమును జెవులం దలతల మెఱయుచుండు కుండలం బులు నుండెను. కన్నులు తామరఱేకులవలె విశాలములై చెన్నుగులుకుచుండెను. బాహువులు మిక్కిలి దీర్ఘములుగాను దేహ మతిదృఢముగాను నుండెను. కుంతి దాఁగన్నచిన్నారి కొడుకు నాతనిఁగాంచి యుప్పొంగిచెలంగి యానందాబ్ధి తరంగ ముల మునిఁగినదయ్యెను. ఆ తేజ మారూప మారేఖయు లోకసామాన్యములా ? చూచుటకే పదివేల కన్నులు గావల యును గాదే? చూడఁ జూడ ముద్దులు మూటగట్టుచున్న చిన్ని మొగమును, ముద్దుబెట్టుకోలేఁది నమృతమూరుచున్న పాలబుగ్గ లును దాఁకుకొలఁది నుత్సాహము గల్గించుచున్న మువ్వంపు టవయవములును, దలఁపఁ దలఁప మనోరథ ప్రవాహములు పొంగిపొరలు లాగునఁజేయు మూర్తివైభవమును వర్ణనాతీత ములు. ఆహా ! వానిఁజూడ నోచిన కన్నులేకన్నులు. వానిం గన్న కడుపేకడుపు. ఆ పురుటింటిని మెఱయించు నా కవచము విద్యుద్దీపమువలెనుండెను. త్రిలోకదీపకుని పట్టియెట్లుండును ? పుట్టినప్పుడే యారాచఠీవి రాజరాజులనెల్ల గెలుచునని బాస

గావించు నట్లుండెను. ఆ రూపరేఖలు మహారాజ్యపదవి నందఁ గలఁడని చాటుచుండెను; మూలలు నిండిన యా మేనిడాలు దిగంతముల వఱకుఁ గీర్తి వ్యాపించునని సూచించు లాగున నుండెను.

కుంతి యాకాలకీడకాని గన్నవార్త కుంతి భోజునినగరున కెఱుక నగుగలదా? బంధువులెల్లఁ గానుకలుగొని వత్తురా? మంగళవాద్య ఘోషములు చెలంగునే? అట్లు కానేరదు. ఎట్టి కొడుకైనను వాని వీడక నిందకొడిగట్టునే? గుట్టు వెలుపడిన కీర్తి గౌరవములు పోఁగొట్టుకొనదు.

కుంతి యా కొడుకును తెప్పలల్లార్పక చూచుచుఁ దల యూఁచి, మేను బులకింపనుఱచి చెక్కిలి ముద్దు పెట్టికొనెను. అక్కునఁ జేర్చికొనెను. ఇంతలో దాదికూఁతురు రాఁగ లోకాపవాదభయము బల్లెమువలె హృదయమునందు గ్రుచ్చికొని యావలి వైపునకు దూసికొనిరాఁగ నాపొత్తులపాపను దయమాలి దాదిచేతుల దబ్బున దిగవిడిచి, "దాదీ! కావవే వీని నెందైనఁ గొనిపొమ్ము. ఆలసింపకుము. వేఱెద్దియు నాలోచింపకుము?" అని తొందర పెట్టసాగెను. దేహమంటియున్న కవచైనఁ దుడువ నవకాశములేదు. ఆ యిరువు రాలోచించి యా బిడ్డ నెచ్చటనేని విడువఁదలఁచి యూరి వెలుపలికి వచ్చిరి. అప్పుడశ్వనది నొక మందసము గొట్టుకొని వచ్చుచుండుట

గాంచిరి. దాని నాశుకువును బెట్టినదిలో విడిచిన నేరికేనిఁ జిక్కి యనురాగక్కియుండునని యెంచి విడిచిరి, అది చూడ నేడిదో ప్రవాహముఁ గొట్టుకొని పోవుచున్నట్లు గోచరించెను గాని యందున్న యనర్ఘవస్తు వెవ్వారికిని దెలియకుండెను. ఆ పేటిక కంటికి దూరముగాఁ జనునంతవఱకుఁ గుంతికి మనస్సుకుదుటఁ బడినది గాదు, అది మఱుఁగు వడఁగానే యపవాద భయము హృదయాంతరాళమున దాఁగియున్నను ప్రేమః ఘః తటాలుఁ బైకుబికి కన్నుఁగనలఁ బ్రవహింపసాగెను, మందసము గొట్టుకొనిపోయిన వైపుననే చూచుచు;

“హా! కన్నకొడుకుల నిట్లు నట్టేటఁ ద్రోయుపాపులును లోకమునఁ గలరా! నిన్నుఁగన్నారఁ జూడనోచితిఁగాని యెత్తి పెంచి పెద్దఁజేసి నీముద్దులఁ జూచుభాగ్యమునకు నోచనైతిని గదా! మహారాజు కూఁతుకడుపునఁబుట్టియు సకలలోక ప్రదీపకుఁడగు సూర్యదేవుఁడే నీకుఁదండ్రియయ్యుఁదుదకు దిక్కులేనివాని వగిదినైతివిగా!

బిడ్డా! నీచక్కఁదనమున కెన్నిరతులు గట్టినను జాలదు గదా! కావురని యాఁకొని యేడ్చితివేని నీకుగ్గుపాలెవరు పోయుదురు? సూర్యదేవు ననుగ్రహముగల్గియు నీనిర్భాగ్యురాలి కడుపునఁబుట్టిన పాపముచేఁగదా నీప్రాపును జూపును నీటిపాలయ్యెను! మందసమే నీకు బంగరుతొట్లయయ్యెను.

నా నెచ్చికత్తెలకు బదులుగా నలలబంతులు నినుగాచుచున్నవి. తామరలయందలి రాయంచధ్వనులు నీకు జోలపాటలగు చున్నవి.

నాచిన్నియన్నా! నాచిన్నారిపట్టీ! నాముద్దులగని! హాయిగా నామంచముపయిన విహరించుచుంటివా! నీవు నా నాఁటికిఁ బెరిఁగి ముద్దులుమూట గట్టినట్టుగ నుండునప్పుడు పున్నమ చందురునివలెఁ గళకళలాడు నీమోమునఁ జిన్న నవ్వు మొలచునపుడును, విరిదలగు నీకన్నుఁదామరలు దెఱచి చూచునపుడును వేడుకగాఁ జూచుచు నీచిన్న నోరినుండి బోసిగులతో వచ్చునట్టి మధురముగా వెడలుచున్న తొక్కుపలుకుల సొంపు నాఁకోని కాలు చేతులు విసర్చుచు నీల్గుచు నావురని యేడ్చుచుండ నప్పటి యందమును, మొలగజ్జెలు చీరాడుచుండ నల్లనల్లనఁ బడుచుఁ లేచుచుఁ దప్పటడుగు లిడుచునడచునట్టి సౌందర్యము నీ యీడుబాలురఁగూడి యాడుచుండ దుమ్ము బ్రుంగియుండు నీచెలువము నిది యది యనక యేదియో యిమ్మనిరవ్వపెట్టి కన్నీరులేక యేడ్చు నీబాలి యేడ్పులును నీకలికి దుడుకుతన మును గాంచు భాగ్యము నాకోఁ గూడదయ్యెను. అందుకు నోచుకొనకపోయినను నింకఁ గొంతసేపేని నినుజూడ నోచు కొననైతినిగదా! నినుఁగౌఁగిలించి కొనియైనఁ దృప్తిపడక

పోయితివిగదా ! హా ! దైవమా ! నోచినదెల్ల నినువరదలోఁ ద్రోయుటకా ! పాపీ !' నావంటి నిర్భాగ్యురాలికిఁగాక యే పుణ్యవంతురాలికి దొరకనున్నావో అట్టిపుణ్యమునకే భాగ్యవతి నోచినదో యచటికే పొమ్ము. ఆమహాలక్ష్మి యేనిన్ను మక్కువతోడ వక్కునఁజేర్చి ముద్దులాడియాడి చొక్కనిమ్ము, నేనిటఁ బురపురఁ బొక్కుచుండెదను, కొన్నాళ్లకుఁ బెద్దవైరిగి సహోదరులతోడ నానావైభవరియు, బాహు[illegible] [illegible] వైభవరియుఁగూడి [illegible]గా నపుడు మహా[illegible] [illegible] సింహమువలె నుండదగుదును భయంకరముగాను గనఁబడు చుందువు. అపుడు యువతులకుఁ గన్నులపండువుగను శత్రువులకు భయంకరుఁడుగ నుందువు. ఏదియుఁ జూడలేనిదానను నేనొక్కతనగుదును, సూర్యుఁడు నీవెచ్చటనున్నను జూచుచుండఁగలఁడు. అతఁడు నీజనకుఁ డగుట మహాధన్యుఁడ యగుచున్నాఁడు, అన్నిటను భాగ్యహీనను నేనయగుచున్నాను.

అట్లేల తలఁపవలెను. సూర్యుఁడటు చేతఁగప్పికొని నంతన మఱుఁగుపడునే ? నీవును మఱుఁగుననుండిన నాకుఁ దెలియకుండునే? నీదేహకాంతియు, సహజకవచకుండలములును నిను బ్రకటింపకయుండునా ? ఇప్పుడుగాకున్న నింకొకప్పుడైన నినుజూడకపోవను. అదియేచాలును. లోకములకెల్లఁ గురియు

వాస నిరుపేదకుమాత్రము లేకపోవునా ? తండ్రీ ! నీవు నదిలోఁ బడిపోవుచున్నావు. ఏ మొసళ్లకును సుళ్లకును జిక్కక, క్రూరజంతువుల నోళ్లకుఁ బాలుగాక సేమముగాఁ బొమ్ము. నీకు భూమ్యాకాశముల యందును, జలాగ్నుల యందును, మహా సముద్రముల యందును, భయంకరారణ్యముల యందును శుభంబగుఁగాక. దేవతలు, సిద్ధులు, సాధ్యులు మున్నగు వారంవఱును సదా కరుణతోడ విడువక రక్షించుచుందురుగాక.”

అని యాశీర్వదించి, తిరిగి తిరిగిచూచుచు మనస్సును జాల నేపటికి మరల్చుకొనెను. ఇంతలోఁ దూర్పు దెల్లవాఱుచుండుటఁబట్టి దాదికూఁతు;“రక్కా! ఇఁక మనమిక్కడ నుండిన సందేహాస్పదల మగుదుము. ర”మ్మని పిలుచుకొని గూఢప్రకారముగాఁ గన్యాంతఃపురముచేరి యెప్పటివలెఁ బ్రవర్తించుచుండెను. కుంతిమాత్రము చారులఁబంపి మందసపు పోకడ నరయుచుండెను. ఆపెట్టె నదీవేగమునఁ గొట్టుకొని పోవుచు నశ్వనదినుండి చర్మణ్వతికిని నందుండియమునకు నందుండి గంగకును బోయిచేరెను. ఆ ప్రవాహమున గొట్టుకొనిపోవుచు చంపానగర సమీపమునఁ బోవుచుండెను. ఆసమయమున నతిరథుఁడనువాఁడు దనపడఁతులతో గంగలో జలక్రీడ సలుపుచుండెను. అలలవెంబడి వచ్చుచుండు నామందసను [illegible]

జిక్కఁగాఁ గన్పట్టెను. అతిరథుఁడా మందసముచూచి యాశ్చర్య పడి పరిజనులఁబంపి దానిం దెప్పించెను. అంతనతఁడు దాని రహస్యముగఁ దెఱచిచూచెను. అందుగన్నులు మిఱుమిట్లు గొల్పుచున్న చిన్నిబాలుఁడు దలతలమని మెఱయుచున్న బంగరు కవచములును గుండలములునుగల్గి ప్రకాశించు చుండెను. అతిరథుని యాశ్చర్యమునకు మితియే లేదు. మఱియిత నికి లేక లేక చిక్కినపుడానందమునకుఁ బారముండునే ? ఆహా! యట్లే చేతులారఁ గ్రుచ్చి యెత్తికొని తనప్రాణేశ్వరియగు రాధకుఁజూపి; "రాధా ! ఇదిగో ! బిడ్డలు లేకయున్న మనకు మనపాలిటి దైవమీ బుడుతని దయచేసెను. చూచితివా వీని రూపమును దేజమును ! ఇట్టివాఁడు మానవులబిడ్డఁడగునే ? వీఁడు దేవసంభవుఁడే యగును." అని యాబిడ చేతికిచ్చెను ఆమె యాబాలుని ఱొమ్మునఁ గ్రుచ్చి యదిమికొనెను. వారంత పతి సంతోషముతో నాబాలునిఁ దమగృహమున కెత్తుకొని పోయి తమకులమునకుఁ దగులాగున జాతకర్మాదులఁ గావించిరి. సహజకుండలాలంకృతుఁడు గావునఁ గర్ణుఁడనియు, వసు కవచము దాల్చినవాఁడుగాన వసుషేణుఁడనియు నామమిడిరి. రాధాపుత్త్రుఁడగుట రాధేయుఁడనియు నాతనికిఁ బేరుగల్గెను. కుంతి యీ వృత్తాంతము చారుల మూలమున విని సంతాపము దీఱి సుఖియుండెను.

అతిరథునింటఁ గర్ణుఁడు నానాఁడుల పెరుఁగుచుండెను. కొంతకాలమునకు వానికెలప్రాయము వచ్చెను. కన్నులు మఱింత వెడదలై యవయవములు సంధులు చక్కఁగా విభక్తములై, కండబలుపుగల్గి గుండ్రమగు భుజములుగల్గి, విశాలమగు నఱుముగల్గి విరాజిలుచుండెను. తామరయందలి తుమ్మెదకొనమలవలెను జంద్రునియందలి నల్లని కందువలె నతని మొగమునందు నూనూఁగు మీసలుదయించెను. అతని యాకారము పరాక్రమస్ఫూర్తిని సూచించుచుండెను. కంఠస్వరము మత్తిల్లినయాఁబోతు అంకెవలె గంభీరముగా నుండెను. నడక సింహ వృషభ గజముల నడలఁ దిరస్కరించుచుండెను. ఆమూర్తి పొంకమంతయు శృంగార వీరరసముల సంకరముగా నుండెను.

దేహధర్మములఁ జక్కఁగాఁబాటించి యారోగ్యవిధుల జవదాఁటక దురభ్యాసములజోలికిఁ బోవక, శుభ్రమైన మితాహారముందినుచుఁ జక్కఁగ విద్యాభ్యాసముసేయు బాలురు మంచిబలము గలవారుగాను బుద్ధిమంతులుగాను సుందరాకారులుగాను నుందురు. చదువుసాములు లేక చెడునడతలకు లోనయి యారోగ్యము చెఱుపుకొనినవారు రోగముల పాలై మంచి తెలివితేటలు లేక బలహీనులై బహుకష్టములఁ బడుచుందురుగదా !

కర్ణుఁడు గొంచెము పెద్దవాఁడు కాఁగనే తండ్రి వానికిఁ దగిన యుపాధ్యాయుల మూలమునఁ జదువు సాములు నేర్పించు చుండెనుగాని ముద్దుల బిడ్డఁడుగదాయని పాలుపండ్లు తిని పించుచు సోమరిగాఁ జేయలేదు. చదువు చెప్పించుటయకాక చక్కని గుణములును బహుజాగ్రత్తతో వాడుక సేయించు చుండెను, చిన్ననాఁడు చదివినచదువే, చిన్ననాఁడలవడిన గుణములే పెద్దలైనవు డుపయోగించుచున్నవి. కర్ణుఁడు బాల్యము నుండి యబద్ధమాడఁడు, అధర్మము సేయఁడు, అడిగినదిలే దనఁడు, పట్టినపట్టువీడఁడు, ఈఘనలక్షణములే పెద్దవెరిఁగినప్పుడు వానియందు దాతృత్వము, శూరత్వము, దృఢవ్రతతత్వము మున్నగు గొప్పగుణములై మిక్కిలిప్రసిద్ధి కలిగించెను, అయినను వానియందొక దుర్గుణముమాత్ర ముండెను. అది యసూయ, ఆ సద్గుణములవలె నదియు నాతనియం దభివృద్ధి నొందుచుండెను. చందనవృక్షముతోఁ గూడముండ్ల చెట్టును బెరుఁగుచుండునుగదా ! ఆదుర్గుణమొక్కటియే తక్కినసుగుణ ములవల్ల నాతని కెంత గొప్పతనము గల్గుచుండెనో యంతటి తక్కువ పాటును గల్గించుచు వచ్చెను. అదియే వాని దుష్టులతోఁ గూడునట్లుచేసి, ఈవాని మహాగుణములకు, ధర్మములకు ఫలముగా జయము నాయుష్యము నీయక కడ కపజయము నకాలమరణమును గలిగించెను.

అయిదవ యధ్యాయము.

విద్యాభ్యాసము.

హస్తినయని యొకగొప్ప పట్టణముగలదు. అందుఁ బూర్వము శంతనుఁడను రాజు భూమిని బాలించు చుండెను. అతనికి గంగాదేవియందు భీష్ముఁడు పుట్టెను. సత్యవతి యను భార్యయందుఁ జిత్రాంగదుఁడు, విచిత్రవీర్యుఁడు నని యిద్దఱు పుట్టిరి. భీష్ముఁడు పెండ్లి చేసికొనక బ్రహ్మచారిగానే యుండెను. చిత్రాంగదుఁడు పెండ్లి కాకమునుపే యుద్ధమున గంధర్వులచే వధింపఁబడెను. విచిత్రవీర్యునకుఁ బెండ్లియైనను సంతానము లేక పోయెను. కాఁబట్టి వ్యాసుల ప్రసాదమువలన నతని భార్యలైన యంబికయందు ధృతరాష్ట్రుఁడును, నంబాలికయందుఁ బాండువును, వారి దాదియందు విదురుఁడును బుట్టిరి. ధృతరాష్ట్రుం డంధుఁడు గాన రాజ్యమును బాండువే పరిపాలించు చుండెను. అతనికి భీష్ముఁడు సహాయుఁడుగాను విదురుఁడు మంత్రిగాను నుండిరి. ధృతరాష్ట్రుఁడు గాంధారరాజపుత్రియు శకుని చెల్లెలునగు గాంధారిని బెండ్లాడి దుర్యోధనుఁడు దుశ్శాసనుఁడు మొదలైన కొడుకుల నూర్వురను గాంచెను. పాండువు స్వయంవరమందుఁ గుంతిని, మద్రరాజు కూఁతురగు మాద్రిని బెండ్లాడెను. అతఁడు కిందముఁడను మునిశాపమున సంతానము వడయలేక పోయెను గాన, నతని పంపునఁ గుంతి

దూర్వాసుఁ డిచ్చిన మంత్రమునుగొని, యముని, వాయు దేవుని, నింద్రుని నారాధించి వరుసగా యుధిష్ఠిర భీమార్జును లను పుత్త్రులను మువ్వురఁ గాంచెను. మాద్రియుఁ గుంతి యుపదేశముచేత నశ్వినీదేవతల నారాధించి నకుల సహదేవు లను గాంచెను దుర్వాసుఁ డిచ్చినమంత్రమే యీ యైదు గురు పుట్టుటకు మూలము. పాండురాజు భార్యలతోడను, బుత్త్రులతోడను శతశృంగమనుచోట వసించుచుండి యటనే మరణము నొందెను. మాద్రి సహగమనము చేయఁగాఁ గుంతి కొడుకుల నైదుగురను దోడుకొని హస్తినాపురమునకు వచ్చి ధృతరాష్ట్రుని యొద్ద నుండెను.

భీష్ముఁడు తన తండ్రియగు శంతనుఁడు తెచ్చి పెంచిన కృపా చార్యులనెడి బ్రాహ్మణుని యొద్ద నాకుమారు లందఱకు విలు విద్య నేర్పుచుండెను. ఆ కాలమున ద్రోణుఁడను నొక్క బ్రాహ్మణోత్తముఁ డుండెను, అతఁడు పరశురాముని శిష్యుఁడై విలు విద్యయందు మహాప్రవీణుఁడుగా నుండెను. కృపుని చెలి యలను బెండ్లాడి ద్రోణుఁ డశ్వత్థామ యనెడి పుత్త్రునిఁ గాంచెను. భీష్ముఁడతని సకుటుంబముగా నిలిపికొని యతని చేతను గుమారులకు విద్య చెప్పించుచుండెను, అపుడు భూత లమునఁ గల రాజపుత్త్రులందఱు నతనియొద్ద విద్యగఱచు చుండిరి.

అతిరథుఁడు తనకుమారుఁడగు కర్ణునికి యౌవనము రాఁగనే ద్రోణాచార్యులయొద్ద విలువిద్య నేర్చుకొనుటకు నియమించెను. ధృతరాష్ట్రుని పుత్త్రులు కౌరవులనఁ బడుదురు. పాండుని కుమారులకుఁ బాండవులనియుఁ బేరు. కర్ణుఁడు వీరితోఁడఁ గలసి కృపుని యొద్దను, ద్రోణునియొద్దను నాయుధ విద్య నభ్యసించుచుండెను. కర్ణునకుఁ జిన్ననాఁటినుండి కౌరవులలో పెద్దవాఁడగు దుర్యోధనునితో స్నేహము గల్గియుండెను. ద్రోణుని యొద్ద రాజకుమారులందఱును కత్తి మొదలగు వానిని త్రిప్పుట, బాణములను ప్రయోగించుట, గుఱ్ఱములను, గజములను, రథములను నెక్కుట మొదలగు యుద్ధ విజ్ఞానముల నభ్యసించుచుండిరి. వారి యందెల్లఁ బాండవులలో ధర్మరాజు రథయుద్ధమునందును, భీముఁడు గదా యుద్ధమునందును, నకులుఁడు ఖడ్గయుద్ధమునందును మహాసమర్థులై యుండిరి. ఇంద్రుని యనుగ్రహము వలనఁ బుట్టిన కుంతికొడుకు తా యర్జునుఁడు మిక్కిలి కష్టముల నోర్చి యన్నింటియందును, ముఖ్యముగా విలువిద్యయందు నెల్లవారి నతిశయించుచుండెను, కర్ణుఁడుకూడ నర్జునుని యంతటి వాఁడయ్యును రాజకుమారుఁడు గానందున వాని సామర్థ్య మప్పుడు ప్రకాశముగా కుండెను.

౨౦వ యధ్యాయము.

కర్ణుని యంగరాజ్య పట్టాభిషేకము.

అంత నొకనాఁడు కుమారులెల్ల నాయుధాది విద్యలందుఁ దేఱిన పిదప ద్రోణుఁడు రాజునకుఁ దెలిపి వారల ప్రవీణతను బరీక్షింపవేఁడెను. అప్పుడు రంగ మొకటి యేర్పఱచి యందు రాజయిన ధృతరాష్ట్రుఁడును భీష్ముఁడు మొదలైన పెద్దలును పతివ్రతా స్త్రీలును పట్టణజానపదులి వారును బల్లెపట్టుల వారును నందఱును నది చూచుటకు వచ్చియుండిరి. విద్యా ప్రదర్శన మారంభమయ్యెను. ద్రోణుఁడు రంగము నడుమ నిలిచి యాయాకుమారుల కౌశలములను సభ్యులకుఁ దెల్పుచుండెను. అంతఁ దన ప్రియశిష్యుఁడగు నర్జునుని నేర్పు చూడుఁడని సభవారి నెచ్చరించి, వానిని రంగమునందుఁ బ్రవేశ పెట్టెను, అర్జునుఁడు దక్కిన రాజకుమారులు చూపని విధములెల్లను జూపి సభ్యులకు మిక్కిలి యాశ్చర్యము గలిగించుచుండెను. అందఱును చిత్రములవలె ఱెప్పలు గదల్పక చూచుచుండిరి. అర్జునుని వంటి విలుకాఁడు లేకుండెను. అన్నికష్టములు పడి విద్య నేర్చిన వాఁ డగ్రగణ్యుఁడు గాకుండునా? అర్జునునకే యంత యగ్రగణ్యత్వమా? పై చేయిగా వఱియెవ్వఁడును లేఁడా? మనకర్ణుఁ డేఁడీ! పేరునకు సూతుని కొడుకే కాని సూర్యుని

ప్రభావమునఁ గదా జనించెను? కొట్టినఁ గదా చెకుముకి రాయి నిప్పులు గ్రక్కును ?

అంతలో రంగద్వారమున మేఘము గర్జించునట్లు మహా ధ్వని యొకటి వినఁబడెను. జనులెల్లఁ బిడుగుపడెనా, భూమి బ్రద్దలయ్యెనా యని నలుప్రక్కలఁ జూచిరి. అది మనకర్ణుఁడు భుజములప్పళించిన చప్పుడు. అది వాని ధీరవహంకారము. వాఁడు సహజములయిన కవచకుండలములు మెఱయుచుండఁగా, వాఁడి కత్తిని నడుమునఁ జెరవికొని పెద్దవిల్లు చేతఁ బట్టికొని రంగములోపలికి వచ్చెను. అప్పుడు వానికి మంచి యెల ప్రాయము వానిని జూడఁగా బలముగల మదపుటేనుఁగువలెను బరాక్రమముగల సింగమువలెను గనఁబడుచుండెను. దేహము మిక్కిలి యొడ్డును బొడవును గల్గి బంగారు చాయతో వెలుఁగు చుండెను. గుండ్రముగానున్న రంగప్రదేశము చుట్టును జూచి యంతఁగాఁ బాటింపనట్లే ద్రోణునకును గృపునకును మ్రొక్కెను. సభ్యులందఱును, వీఁడెవ్వఁడోయని కుతూహలముతో తెప్ప వ్రాల్పక చూచుచుండిరి. కర్ణుఁడు గర్జించి యర్జునునిఁ జూచి, 'నిలునిలు' మని యదల్చి ? "అర్జునా! నీ వొక్కఁడవే గట్టివాఁడ వని త్రుళ్ళకుము. నీవు చూపిన విద్యలకంటె నెక్కుడుగా నాకును దెలియును. ఇందఱికన్నుల యెదుటనే చూపెదను. చూడు" మనెను, అప్పు డర్జునునికి సిగ్గును గోపమును బుట్టెను.

దుర్యోధనునకో యుబ్బు పట్టఁజాలకి పోయెను. కర్ణుఁడు
ద్రోణుని యనుజ్ఞ దీసికొని యర్జునుఁడు చూపిన విన్నాణము
లెల్లను జూపెను. అర్జునునికంటె గట్టివాఁడెవఁడు గల్గునాయని
దిక్కులు చూచుచుండిన దుర్యోధనుఁడును, వాని తమ్ములును,
గర్ణుని గట్టిగాఁ గౌఁగిలించుకొనిరి. సకలరాజకుల ధ్వంసనము
నకై పుట్టిన ధూమకేతువు గదా యీ దుర్యోధనుఁడు ? ఆ
దుష్టునకు సకల బలమును నాకాశవ్యాపమును గూడినఁ గదా
కార్యము కొనసాగును? అగ్గికి బలవంతమైన గాలి తోడుపడినఁ
గదా యది యడవినెల్లఁ గాల్చును ! కాలసర్పమునకు విషపు
కోఱవలె వానికిఁ గర్ణుఁడాయెను. భూభారావతరణమను
భగవంతుని కార్యతంత్రమునకా యిద్దఱమైత్రి యగ్నియుం
గట్టిపడయునగు. దుర్నివారమైన సకల రాజకీయ యజ్ఞము
కొనసాగుటకిది గట్టి దీక్ష. అంత దుర్యోధనుఁడు గర్ణునితో,
"వీరాగ్రణీ ! నీవు వచ్చినది మాభాగ్యము. మా గౌరవమును
నిలిపితివి. మమ్మును మాకురురాజ్యమును నీ యిచ్చ వచ్చి
నట్లను భవింపు" మనెను. మహారాజా పట్టపుకొడుకే
తన్నట్టుచేఁ బట్టినాఁడు. ఇఁక నాయువరాజుతో పాటొకరాజు
కావలసినదే కొదువ. అప్పుడే కదా వాఁడాడినదే యాటయై
యుద్ధనాటకము సాగఁగలదు ! కర్ణుఁడు దుర్యోధనుఁడు దన్నట్టు
మెచ్చినందులకుబ్బి యతనికి మఱింత మెప్పుగలిగించుటకై

"మహారాజ ! ఈ రాజ సమూహమును నీవును జూడఁగా నర్జు
నితో ద్వంద్వయుద్ధము సేయక విడువను సుమీ !" యనెను.
దుర్యోధనుఁడు; "వీరోత్తమా! నాతోడఁ గూడి సకలభోగము
లను భవింపుము. నాచుట్టాలకుఁ బ్రియము సేయుము. నాగిట్టని
వారితలపైని గాలుపెట్టు" మనెను. ఆమాట యర్జునుఁడు
దనకుఁ దగులునట్లు చెప్పినదిగాఁ దలఁచి; "కర్ణా ! పిలువకయే
వచ్చి లేనిపోని బింకములు పదరుచున్నావుగా ! ఇదిగో నీతలను
నేలఁగూల్చెదను. సద్గతికిఁ బొ" మ్మనెను. కర్ణుఁ "డర్జునా ! ఈరంగ
ప్రదేశము నీకు మాత్రము సొంతమా? విలువిద్ద నేర్చిన వారి
కెల్ల సామాన్యమే కదా ! ఊరక పదరకుము. వీరుఁడవయినఁ
బాణములతోఁ బనచూపు" మని రంగ స్థలము నడుమ యుద్ధ
మునకు సిద్ధముగా నిలిచెను. అర్జునుఁడు వానికి మాఱొడ్డి
నిలిచెను. కర్ణుని పక్షమున దుర్యోధనుఁడు మొదలగువారుండిరి.
స్త్రీలనడుమ నుండి చూచుచున్న కుంతి కవచకుండలములను
బట్టి కర్ణుఁడు తన మొదటి కొడుకని తెలిసికొనెను. ఆ యిద్దఱు
కొడుకులు యుద్ధము సేయఁ బూనుటకు మనము కలఁగి
మూర్ఛపోగా నచ్చటనుండువారు చల్లని చందన జలములు
చల్లి యామెకుఁ దెలివి గలిగించిరి. ద్వంద్వ యుద్ధ మారంభ
మగుచుండెను. ఆ యుద్ధపు మర్యాదలు కృపునికిఁ దెలియును
గాన నతఁడు కర్ణునితోఁ; "నర్జునుఁడు పాండు రాజ పుత్రుఁడు-

నీనిది కురువంశము. ఇట్టి వీఁడు నీతో ద్వంద్వయుద్ధము సేయ నున్నాఁడు. నీతల్లి దండ్రు లెవరో కులమేదియో చెప్పుము. రాజ కుమారులు కులమును బుట్టుకయుఁ దెలియని వారితో యుద్ధము సేయరు సుమీ!" యనెను. కర్ణుఁడు తనకులము తక్కువ యగునది కాఁబట్టి చెప్పలేక తలవాంచెను. దుర్యోధనుఁ డది చూచి కృపునితో; "ఆచార్యా! ఇది యేమి న్యాయము? రాజకులమునఁ బుట్టినవాఁడే రాజని చెప్పఁబడునా? శూరత్వ ముగలవాఁడును సేనలు నడుపువాఁడును గూడ రాజని శాస్త్ర ములు చెప్పవా? ఇంతేల? వీఁడు రాజుకాఁడని కదా యర్జు నునితో యుద్ధము సేయరాదంటిరి! మంచిది. ఈ యందఱ యెదుటనే, యీ క్షణముననే వీని నంగరాజ్యమునకు రాజుగాఁ బట్టాభిషేకము చేసెదను. అప్పుడేమనెదరో, చూత"మని బిగ్గఱగాఁ బలికెను. అంత వాఁడు ధృతరాష్ట్రుని, భీష్మునిఁ బ్రార్థించి వారియనుజ్ఞనుగొని యభిషేకమునకు వలయున వెల్ల సిద్ధముచేసి, బ్రాహ్మణులకు గోవుల దానముచేసి, "కర్ణుఁ డంగరాజ్యమునకర్తుఁడగుఁగాక"యనిపలికించెను. పెద్దలయనుజ్ఞ గాని, యాశీర్వాదముగాని యేపాటివానినేనిం బూజ్యునిగాఁ జేయునుగదా! పిదప మంత్రవేత్తలయిన బ్రాహ్మణులు గర్ణుని బంగరుపీఠమునఁ గూర్చుండఁబెట్టి బంగారుకుంభము లందలి పుణ్యజలములచేత నంగరాజ్యమునకుఁ బట్టాభిషిక్తుం

జేసిరి. కర్ణుఁడు కిరీటము కేయూరములు హారములు ఛత్ర చామరములు మున్నగు రాజచిహ్నములు గల్గి రాజలక్ష్మితోఁ ప్రకాశించు చుండెను.

ఇపు డా సూతుని బిడ్డఁడు దొడ్డ రాజయ్యెను గదా! కులము తక్కువదైనను, ధనము లేకపోయినను, మంచి విద్యయు, గొప్ప శక్తియుఁ గలవాఁడు తప్పక యున్నతస్థితికి వచ్చుననుటకు మన కర్ణుఁడే దృష్టాంతము. కర్ణ దుర్యోధనుల కది మొదలు స్నేహము మిక్కిలి దృఢమాయెను.

ద్రోణ శిక్ష, గొప్పవానితోఁ జెలిమి, కృపుని హేళనము నివి కర్ణుని రాజ్యాధిపత్యమునకు హేతువు లయ్యెను. ఇఁక జగన్నాటక సూత్రధారుఁడు భారత కథారంభ ప్రదర్శనమున కారంభింపవలసినదే కదా? కర్ణుఁడు మిక్కిలి యుబ్బి దుర్యోధనునితో; "సర్వ రాజుల సమక్షమున నన్ను రాజుం జేసి మహిమాన్వితునిఁ గావించితివి. నీదే కదా శక్తి! ఇందులకుఁ బ్రతిగా నీ కేమి చేయవలయునో చెప్పు"మని యడిగెను. దానికి వాఁ "డేమియు వలదు. నీ చెలిమియున్నఁ జాలును. నా యిష్టమంతియ" యనెను. కర్ణుఁడు రాజుగా నభిషిక్తుఁ డయ్యెనను వార్త యంతటను దోడనే వ్యాపింపఁగా, ధృతరాష్ట్రుని రథమున నున్న యతిరథుఁడు విని, యానంద పరవశుఁడై మనసు పట్టలేక కర్ణునొద్దకుఁ బిరబిరఁ బరుగిడివచ్చెను.

అంగ రాజ్యాధిపతియైనను దండ్రికి బిడ్డఁడే కదా ! అయిన నట్టి మహోన్నతియందును బరియాచకము చేసిన కృపుని కన్నుల యెదుటను, పెక్కురు రాజ్యాధిపతులు మూఁగియున్నచోటఁ దా నతిరథునికొడుకని ప్రకట మగుట కెట్టివానికేని మానస మొప్పునా ? అట్లని కర్ణుఁడు మొగము ద్రిప్పికొనెనే ? మాఱు పలుకకుండెనే ? ఆగుణనిధి యట్లు సేయునట్టివాఁడుగాఁడు. గంగనుండి యెత్తి పెంచి పెద్దఁజేసి నంతవఱకే తండ్రియా ? అంగరాజ్యము వచ్చిన వెనుక నాతఁడు సూతుఁడా ? ఎక్కడి మాట ? తండ్రియే దైవము. అంగదేశ మొక్కటికాదు. త్రైలోక్య రాజ్యమైనను, దండ్రికి సమానము గాదు. రాజ్యమునకంటెఁ బితృభక్తియే పూజ్యము. కాఁబట్టి కర్ణుఁడు తోడనే లేచివచ్చి తండ్రికి మ్రొక్కెను. అతిరథుఁడు ; "నాయనా !" యని కొడుకును గౌఁగిలించుకొని, యానందబాష్పముల వాని శిరమునుదడిపెను. అంతటి రాజ్యపదవివచ్చినను నెత్తి పెంచిన తండ్రిని మఱువని కర్ణునిగుణమేకదా గుణము ?

భీముం డదిచూచి, కర్ణుఁడు సూతకులమునఁ బుట్టినవాఁడని తెలిసి నవ్వుచుఁ ; "కర్ణా ! నీకులమునకుఁ దగునట్లు మునికోలఁ గొని రథము తోలుదువేకాని రాజపుత్త్రుఁడయిన యర్జునునితో యుద్ధము సేయుదువే ? సారథికా రాజు తోడి పోరు ? అట్లు రాజతోడిపోరుటకే కాక, రాజోత్తముఁ డనుభవింపఁ

దగిన రాజ్యమునకుఁ గూడవత్తువా ? మంత్రపూతమైన పురో
డాశము యజమానునకుఁ గాక కుక్కకిడఁదగునే ?" యనెను.
అదివిని కర్ణుఁడు వెలవెలఁబోయి, యేమిచెప్పుటకుఁ దోఁపక
నిట్టూర్పు మొగంబువాఁడయి యాకాశముననున్న సూర్యునిఁ
జూచుచు నూరకుండెను. అట్లు కర్ణుఁడు సిగ్గునఁ బరితప్తుఁడగు
చుంటఁజూచి,తమ్ములనుండి తటాలున దుర్యోధనుండు మదపు
టేనుఁగువలె వెలువడివచ్చి మిక్కిలికోపమున భీమునితో
"భీమా!కర్ణుని నీవిట్లు నోనాడఁ బలుకుదువే?నీచకులుఁడని తలఁప
వచ్చునా ? లేడికడుపునఁ బులిపుట్టునా ? వీని దివ్యతేజము
చూడఁగా నీబుద్ధి కథమకులమునఁ బుట్టినవాఁడని తోఁచు
చున్నదే ? దేవతలయు, నదులయు, పుట్టుకలాదివిచారింపఁదగవు.
ఇంద్రుని వజ్రము దధీచి యెముకనుండి పుట్టినది. దేవతలమాట
మనకేల యందువా? మనయాచార్యుఁడగు కృపునిపుట్టుక తెల్లు
ఱుబ్బునుండియేకదా? ద్రోణుఁడు పుట్టినది ఘటమునఁగదా?
ఈ దివ్యలక్షణములును సహజములైన కవచ కుండలములును
జూడ నితఁడు సామాన్యపురుషుఁడు గాఁడని తెలియుచున్నది.
వీని బాహుబలమున కీతఁ డంగరాజ్యమునకేకాదు. సకల
భూమండల రాజ్యమునకు నర్హుఁ" డనెను. ఇంతలో సూర్యుఁ
డస్తమింపఁగా దుర్యోధనుఁడు గర్ణునిఁ దోడ్కొని నిజగృహ

మునకుఁ బోయెను. పాండవులును మఱియుఁ దక్కినవారును దమ తమ నివాసములకుఁ బోయిరి.

దుర్యోధనుఁడు భీమునకు బాల్యమునుండి విషాదులు పెట్టి బాధించుచు వచ్చెను. అర్జునుని విలువిద్దె నేర్పునకు భయపడి, యడఁగి మడఁగి యేమిచేయుటకుఁ దోఁపక దుఃఖించుచు, రాత్రులఁ జింతచే నిద్రింపకుండెను. ఇపుడంతటి విలుకాఁడు గర్ణుఁడు సహాయముగాఁగ రొమ్మునఁ జేయివెట్టికొని హాయిగ నిదురించుచుండెను. ఇంక వాని పూర్వపు దౌష్ట్యము మరల వెలువడి త్రుళ్ళఁ జేయుచుండెను.

కర్ణునకుఁ బాండవుల కీర్తినిఁబట్టి మచ్చరమొక్కటి మాత్ర ముండెను. దుర్యోధనునకో వారికీర్తి, కులము, గుణము, శక్తి వీనిఁబట్టి బ్రదికియుండువఱకుఁ దీఱని శత్రుత్వముగల్గి యుండెను. దుష్టుని వైరమునకుఁ గారణములుండునే? కనుక దుర్మంత్రములు, మారణ తంత్రములు క్షణక్షణమునకు వృద్ధి నందుచుఁ దీవ్రమైన వైరాగ్నిరగులుచుండెను. దానికి సమిధలు శకుని దుర్బోధలు. గాలి దుశ్శాసనుఁడు. ఆజ్యము కర్ణుఁడు. ధర్మాత్ముఁడగు కర్ణుఁడు మచ్చరమున్నను నిట్టిఘోరకృత్యములకుఁ దోడుపడఁదగునా యనిన, నూరునుబేరును దెలియని తన్ను రాజుగావించి తనయంతటివానినిఁగా జేసిన తనదొరయిష్ట మెంత దుష్టముగా నున్నను, గష్టముగా నెంచక తీర్పకుండుట

తగునాయని తలఁపవలసియున్నది. తన దుష్కృత్యములకుఁ దోడుపడుట కేకదా మొదలరాజ్యమిచ్చినది! దానినిఁ బుచ్చుకొనినపిదప దుష్కార్యము లాచరింపవలను గాదనుట యెట్లు తగవు? ధర్మాత్ముఁ డయినందులకు దొరకు బుద్ధులు సెప్పి దారికిఁ ద్రిప్పినదోసమా యన్నఁ; గర్ణుఁడు బుద్ధిచెప్పినా యుద్ధమెక్కడిది? అదియంతయు దైవతంత్రముగాన నతనిని దూఱఁ బనిలేదు. దైవము చిత్రించికొన్న కార్యసూత్రమున కనుకూలముగా విషమ మృతమగును. అమృతము విషమగును. శకుని బుద్ధిబలమునకును దానికి నూఱింతలు ముఖ్యమగుకర్ణుని బాహాబలమునకును నుబ్బి దుర్యోధనుఁడు విచ్చలవిడిగాఁ బ్రవర్తించుచుఁ బాండవుల నిలువెడలఁగొట్టియు, లక్కయింట నగ్గి పెట్టి తుద ముట్టింపఁ జూచుచుండెను. కాని తనదుష్కృత్యములకై యున్న వా రేల తనపన్నుగడకుఁ జత్తురు? దుర్యోధనుని నోటినుండి పలుకు వెడలకమునుపే కర్ణుఁడు తనయొఱనుండి కత్తి దూయును. ఆతనికనుబొమలు తిరుగకమునుపే వానితల యూఁగును. ఆతఁడు చెప్పిన దెల్ల వేదము. చేయునదెల్లఁ దనకుధర్మము. కర్ణుఁడా దుర్యోధనుని యాజ్ఞను జెవులతోఁ వినుచు, మనసుతోఁ జింతించుచు శరీరముతో నాచరించుచుండెను.

ఏవడ యధ్యాయము.

అస్త్రసంపాదనా శాపములు.

వంటి యప్పుడు ద్రోణుఁడు గురుదక్షిణగా ద్రుపద రాజును గట్టి తెమ్మని శిష్యుల కెల్ల నెఱిఁగింప నందఱిలో నర్జునుఁడే యావని సాధించెను. ద్రోణుఁ డందులకు మెచ్చి యర్జునుని కంటె నధికుఁడగు విలుకాఁడు లేనట్లు చేయవలయునని తలఁచి బ్రహ్మాస్త్రము మున్నగువాని నొసఁగెను, దీనినిఁబట్టి కర్ణునకంటె నర్జునుఁడు గొంత యధికుఁడగుటచే దుర్యోధనుని గుండెలోని దిగులుహెచ్చుచుండెను. ఇష్టము నెట్లైనఁ గొనసాగించుకొనుట తన జన్మవ్రతముగాఁ గల కర్ణున కది తెలియును గాన నతఁడొక నాఁడు ద్రోణునొద్దకు రహస్యముగాఁబోయి ;

“మహాత్మా ! నీవుశిష్యులందఱి యెడలను సముఁడవు. ఒకరికంటె నన్నమును మఱియొకరికంటె వెన్నయును నీకులేదు. నేను మీశిష్యుఁడను. అర్జునుఁడును మీశిష్యుడే. అట్లుండ వానికి బ్రహ్మాస్త్రముండనాకు లేకుండుట తమ యాదరం బునకుఁ గొదువయేకదా ? నాకును బ్రహ్మాస్త్రము సాంగో పాంగముగ నుపదేశింపవలయును. నేనర్జునకు సమానుఁడుగాఁ గోరి వచ్చితిని. ఇదిమీకొప్పకుండుట తగునా?”

అని ప్రార్థించెను. ద్రోణుఁడు విలువిద్దియం దర్జునునకంటె నధికుఁడు లేకుండవలెనని సంకల్పించు కున్నవాఁడుగాన నిజము

దెల్పినయెడలఁ గర్ణుఁడు నొచ్చుకొనునని తలఁచి తంత్రజ్ఞుఁడు గాన యుక్తియుక్తంబగు మఱియొకకారణంబెత్తి; "కర్ణా! వ్రతముగల్గియుండు బ్రాహ్మణోత్తముఁడో పుణ్యాత్ముఁడగు క్షత్రియుఁడో బ్రహ్మాస్త్రమునందుటకుఁ దగునుగాని యన్యుఁడవగు నీకిచ్చుటతగదు. ఏమిచేయుదు" ననెను. కర్ణునకు మనోరథము భగ్నమాయెను, ఇంకఁ జేయువలసినదేమి? దుర్యోధనుఁడు దన్ను రాజుగాఁ జేసినందుల కర్జునునిఁదాను జయించియ తీఱవలయును. వానిజయింపవలెనన్న బ్రహ్మాస్త్రమావశ్యకము. అస్త్రముగావలయునేని బ్రాహ్మణత్వ ముండవలెను. అస్త్రసిద్ధిలేకుండిన నర్జునుని గెలువరాదు. పగవానిగెలువక యేలిక యప్పుతీర్పక ప్రాణముతో నుండవచ్చునా? మానములేని బ్రదుకేల? వేసముననో మోసముననో వానిగెలిచియ తీఱవలయును. సూతునికొడుకగునన్ను భూపతిఁ గావించినట్టి వానికై యేపోకలు పోయిననేమి? యని నిశ్చయించి, "ఈ బాపఁడు పార్థునియందలి పక్షపాతమున నేమోమిష పెట్టి నన్ను మొగముదుడిచి పంపినాఁడు, ఇతఁడుగాకున్న నీతనివంటివాఁడు మఱియొకఁడు లేఁడా చూతము"

అనితలఁచి మఱునాఁడు మహేంద్ర పర్వతమునకుఁబోయి పరశురాముని దర్శించి, వినయంబున మ్రొక్కెను. రాముఁడు; "నీవెవ్వఁడవ?" వని యడుగఁగా గర్ణుఁడు; "మహాత్మా! నేను

బ్రాహ్మణుఁడను, నాదిభృగువంశము. అస్త్రవిద్యఁగోరి మిమ్మా
శ్రయింపవచ్చితి" ననెను. దానికతఁడు ప్రీతుండై కర్ణునిఁ
బరిగ్రహించి యస్త్రవిద్యయందుఁ బరిశ్రమము సేయింపు
చుండెను, అతని యాశ్రమమునుండి కర్ణుఁడొకనాఁడు ప్రయోగ
లాఘవమును సాధనచేయుచుండెను, అప్పుడొక బ్రాహ్మణుని
హోమధేనువుయొక్క దూఁడ యడ్డముగాఁ బరుగిడుచుండ
నొక్కబాణము దవిలి నేలంగూలెను. దానికాబ్రాహ్మణుఁడు
పరుగిడివచ్చి ; 'యిది యేమి ?' యని బిగ్గఱగానడుగఁగాఁ
గర్ణుఁడు ; "మహాత్మా ! తెలియక చేసినతప్పును గావుఁడు.
వలసినన్నిగోవుల, దూఁడలతోడ మీకొసంగెద" నని యెంతో
ప్రతిమాలుకొనుచున్నను నాతఁడువినఁడయ్యెను. దైవయోగము
వినవిచ్చునా ?

అంతనా బ్రాహ్మణుఁడు కోపమతిశయింప ; "ఓరీ ! నీవు
మేటివాఁడైన పగవానితోఁ బోరునపుడు నీ తేరు భూమియందు
నాటేఁగవలెఁ గ్రుంగునుగాక." యని శాపమిచ్చి వెడలెను.
కర్ణుఁడు ; "కట్టా ! నారథముకాదు. నామనోరథమే క్రుంగిన"
దని చింతించి మేటిధీరుఁడుగాన లోపల నడఁచికొని, పరశు
రామునకు మిక్కిలిభక్తితోఁ బరిచర్యలు చేయుచుండెను.
అమ్మునిదానికిమెచ్చి కర్ణునకు బ్రహ్మాస్త్రమున్నగు పెక్కు
మహాస్త్రమంత్రము లుపదేశించెను. అంత నొకనాఁడాతఁడు

కర్ణుని తొడపైఁ దలయిడుకొని నిదురించుచుండెను. అప్పుడొక కీటకము కర్ణుని క్రిందొడఁగఱచి వేగమ తొలుచుచుండెను. అదితొలుచునపుడు నొప్పి మిక్కుటమై నెత్తురు గాలువలుగా వెడలుచున్నను గురుని నిద్ర చెఱుపనోపక సహించి కదలక మెదలకయే యుండెను, అంతర క్తము ప్రవాహమై పరశు రాముని దేహమున వేఁడిగాఁ దగిలెను. అతఁడు మేలుకొని ; "కర్ణా ! ఎక్కడిదీనెత్తు"రని యడుగఁగా నాధీరుఁడు దనతొడ యెత్తి యాపురువునుజూపి ; "ఇదినాతొడఁ దొలుచుచున్నను మీకు నిదురసెడునని కదలకుంటిని. మతేమియుఁగా" దనెను. ఇంతలో నాపురువు పరశురామునిఁ జూడఁగనే మృతినొంది రాక్షసుఁడై యాకాశంబుననిలిచి, యందుండి యామునితోఁ ; "కరుణానిధీ ! నాకుఁగలిగియుండిన దారుణశాపము మీవలనఁ దీఱినది. నాయెప్పటిరూపు నొందితిని, నేనుగ్రృత్సుండనెడు నొకరాక్షసుఁడను. భృగుమహర్షి పత్ని నపహరించితిని. దాని కతఁడు గనలినన్ను గీటకముగమ్మని శపించెను. మీకటాక్ష మృతము సోఁకఁగనే సుఖమునొందితి" నని చెప్పి యతనిసెలవు గైకొనిపోయెను. అంతఁ బరశురాముఁడు కర్ణునిధైర్యాతిశయము మదిలో నిరూపించి, "ఓరీ ! ఇంతటిరోరుపు బ్రాహ్మణ జాతి కెక్కడిది ? ఎవ్వఁడవు నీవు? నిజముచెప్పు" మని యడుగఁగాఁ గర్ణుఁడు వడఁకుచు ; "నేను సూతపుత్త్రుఁడ"

వనను. అంపులకాముని మిక్కిలియాగ్రహించి; "ఓరీ ! కపట
మున బ్రాహ్మణుండ ననివచ్చి నన్నే మఱచించితివి. నీవు
నేర్చిన యస్త్రవిద్య విఫలమగుఁగాక. నీకపటమునకదితగిన
ఫలము. దాని నీవనుభవింపు" మని శాపమిచ్చెను. కర్ణుని
దుఃఖమేమనవచ్చును ? బ్రహ్మాస్త్రమును గఱవఁబోయి కఱ
చినవానినెల్ల దారవ్రాసి కొన్నట్లయ్యెను. అతఁడు మివుల
దుఃఖించుచు మరలెను. స్వామిభక్తిపరాయణునకు, స్వార్థ
త్యాగశీలునకిట్లు రాఁదగునేయనిన ? సర్వేశ్వరుని భూభారావ
తరణ ప్రయోజనమున కతనికార్య పథమం దిది యెంతయు
నావశ్యకము. అతనికి దుష్టశిక్షణమును, దన్మూలమున
శిష్టరక్షణముగదా యవతార ప్రయోజనములు ! శిష్టులగు
పాండవుల రక్షించి, దుష్టులగు దుర్యోధనాదుల నిర్మూలము
గావించికదా భూభారము దీర్పుటకు సంకల్పము ! అందర్జునుని
ముఖ్యసాధనముగాఁగొని కార్యమంతయుఁ జేయఁదలంచుటవలన
వానిఁ, ఒక్కఁడె యోధాగ్రేసరులనెల్ల నుఱుమాడునట్లు మహాధను
ర్ధరునిఁ గావించినాఁడు. అందులకై పార్థుని ద్రోణాచార్యునకుఁ
బుత్త్రునికంటె నెక్కుడుగాఁ బ్రీతిపాత్రముగను బ్రాణపదముగను,
ముఖ్యశిష్యునిఁగను జేసి యతనివలన విలువిద్దెనెల్లఁ జెప్పించి
నాఁడు. అయినను వానినిఁ బ్రతిఘటించుటకా ద్రోణశిష్యుని,
దివ్యప్రభావసంపన్నునిఁ గర్ణు నేర్పఱచెను. కాఁబట్టియట్టివాని

నర్జుననకు జోడుగావించునా ? బ్రహ్మాస్త్రము దూరమగుటకై సూతకులమను నెపము పెట్టించినాఁడు. బ్రాహ్మణ శాపమునకు లోఁబఱచి మంచి సమయమున రథము క్రుంగునట్లొనర్చెను. మఱియు నస్త్రములెల్ల వమ్మగుటకుఁ బరశురాము నొద్దకుఁ బంపినాఁడు. ఆదూఁడబాణములకడ్డయి కూలుటయు, నాపుర్వు క్రిందఁదొలుచుటయుఁ బ్రమాదజనితములా! కావు కావు. భగవత్సంకల్పాయత్తములు. ఇట్లు రెండువిధములఁ గ్రిందుపఱచుటయెల్ల నర్జునుఁడు క్రిందఁబడకుండుటకే. పార్థునివివాశనము లేకుండిననే భూభారము నిరాటంకముగాఁ దీఱఁగలదు. దైవమేర్పఱచిన పొడవునకు మించి యెంతయెగిరిన నంతకంత పడుటయెకాని పసగలుగదు. దైవబలమునకుముందు మానుషబలమెంత, యనుటకు బ్రహ్మాస్త్రమునకుఁ బోయియున్న కర్ణుఁడే దృష్టాంతము.

కర్ణుఁ డట్లుపోయినపని విఫలమైనను మొగమున నవికారమును జూపక దుర్యోధనుని యొద్దకువచ్చి, "ప్రభూ! పరశురాము నాశ్రయించి యస్త్రములందెల్ల నాఱితేఱితిని. ఈలోకమునందు నాతోయుద్ధము సేయఁగలమగఁటిమి గలవాఁడు లేఁడు చుమీ" యనెను. దుర్యోధనుఁ డానంద భరితుఁడయ్యెను.

ఎనిమిదవ యధ్యాయము.

కర్ణుని విక్రమములు.

కళింగదేశపు రాజగు చిత్రాంగదుఁడు తనపుత్త్రియగు శుభాంగికి స్వయంవరము చాటించెను, దానికి జరాసంధుఁడు, శిశుపాలుఁడు, రుక్మి, మొదలగురాజులు వానిరాజధాని యగు రాజపురమునకుఁ బోయిరి. దుర్యోధనుఁడు గర్ణునిఁ గూడి చతురంగబలములతో నచటికిఁబోయెను. అందఱకును జిత్రాంగదుఁడు వగిసప్రాజలుగావించి విడుదుల నేర్పఱచెను. అంతస్వయంవరము జరుగునపుడు చేతఁబూదండగొని శుభాంగి రాజులమధ్యమునవచ్చి, చెలులీరాజుల పేరులు వేఱువేఱఁజెప్పు చుండఁగా మఱివెంపు నడల నల్లనల్లనఁ బోవుచుండెను. అప్పుడా పడఁతి దుర్యోధనుని వరింపక దాఁటిపోఁగా నాతఁడు కోపించి దానిని బోనీక యడ్డగించి పట్టి రథముపైఁబెట్టి కొనిపోవు చుండెను. అపుడు రాజులెల్లఁ గలంగి యొక్కటిగాఁ గూడుకొని యతనిని భయంకరముగాఁ దాఁకిరి. అతఁడు బాహుబలము మెఱయింపుచుఁ బోరెను. అప్పుడు కర్ణుఁడు వాఁడినారసము లేసి రాజులతలలు డొల్లవేయుచుఁ, దనలాఘవమును విజృంభింపఁ జేయుచు, గర్వంబు ప్రకాశింప శత్రువుల రథ గజ తురగ పదాతులఁ దునిమి తూటాడుచుండఁగా నావీరుని శౌర్యమునకు, బాహుబలమునకును నిలువఁజాలక హతశేషులైన రాజులు

పరుగిడిరి. దుర్యోధనుఁ డందులకు సంతోషించి, యాకన్యను గొని హస్తినాపురమునకుఁ బోయెను. జరాసంధుఁ డపజయమును మనస్సునందే పెట్టుకొనియుండి యొకప్పుడు కర్ణుని ద్వంద్వయుద్ధమునకుఁ బిలిచెను. కర్ణుఁడందుల కిష్టపడఁగా నిద్దఱును యుద్ధము సేయఁ దొడఁగిరి. అంత వారిరువురును దేరులు దిగి బాహుయుద్ధమునకుఁ జొచ్చిరి. కొంతసేపు పెనఁగిరి. అప్పుడు జరాజంధునిసంధులు వికలములుకాఁగా యుద్ధముచాలించి,కర్ణుని మిక్కిలిగౌరవించి, విభవసంపన్నమగు మాలినియను నగరము నియ్యఁగాఁ బుచ్చుకొని మిక్కిలి తేజముతోడఁ దనపురమునకు వచ్చెను. ఇట్లు పెక్కండ్రు శూరులగు రాజులను దఱిమి దుర్యోధనునకుఁ గన్యను గూర్చుటంబట్టియు, జరాసంధుని జయించుటం బట్టియు నతని ప్రసిద్ధి సకల దేశంబులందును వ్యాపించి పాండవులకును హృదయశల్యముగాఁ బీడించుచుండెను. పరశురామునియొద్ద నేర్చినవిలువిద్దె చేతను, పైనఁ బేర్కొనిన రెండు మహాపరాక్రమ కృత్యములచేతను, దుర్యోధనునకుఁ గర్ణునియందుఁ బ్రీతిగౌరవము లతిమాత్రలయ్యెను.

అట్టివీరుని సహాయపుసొంపునఁ గన్నుమిన్నుఁ దెలియక భీష్మ ద్రోణ విదురాదుల బుద్ధులనుగూడ నావంతయు సరకుసేయక పాండవులకు మిక్కిలిక్రూరములగు నపకారములు సేయు

చుండెను, ఎట్టికార్యము లకును గర్ణుఁడు చేదోడువాదోడుగ నుండెను, పాండవుల నూరు వెడలఁగొట్టి వారణావతమునకుఁ బంపి ముసలి తల్లితోడ వారిశరీరములు గాల్పింపఁజూచిన మహాద్రోహమునకీతఁడు 'సెబా'సని తలయూఁచినంతవాఁడు మఱియెంత కొప్పకుండు ? పాండవుల విషయమున నింక నెంత లెంతలో క్రూరకృత్యములు జరిపియుందురు గాని భూభార నివారణము గావింపఁగోరుచున్న దైవమునకది యసమ్మతమగు టచే నట్లుజరుగలేదు.

అంతనర్జునుఁడు ద్రుపదపుత్త్రియగు ద్రౌపదియొక్క స్వయం వరమునకుఁ బోయి యంత్రమత్స్యమును దెగనేసి యామెను జేకొనెను. మత్స్యయంత్రమును దెగవేయఁజాలని కర్ణుని కంటెను దెగవేసినయర్జునుని పరాక్రమ మెక్కుడని తెలిసిన దుర్యోధనుని గర్వము కొంతకుంటువడెను.

బలవంతులతోడి పగ కులనాశమని భీష్మాదు లొత్తిచెప్ప మరల వారినిఁ బిలిపించి యర్ధరాజ్యమిప్పించెను. దానవైరాగ్ని కొంత చల్లాఱినదయ్యెను. ఒక్కమాఱే వైరాగ్నిని బెద్దమంటగాఁ జేసి యుభయపక్షములవారి నిహపరదూరులంజేసి యకాల మృత్యువు వాతఁబడఁజేయుట నీతిగాదు, దానిని గ్రమ ముగాఁ బెంచుచుఁ జల్లార్చుచు, వారిపూర్వకర్మాయత్తములగు సుఖదుఃఖముల ననుభవింపఁజేయుచు, వారికిఁగాలము పరిపక్వ

మగు సమయమున నాయగ్నిం బ్రజ్వరిలఁజేసి దాని కాహుతి గావించుట దైవతంత్రము. ఇంతకుమున్నుఁ గర్ణ మహారాజ ప్రేరితమై మండుచుండిన వైరాగ్ని యిపుడు కొంతచల్లారి యున్నది. అదియాఱుటకు మూలమర్జునుని యంత్రమత్స్యచ్ఛేదన మేయగును. ఈభేదము గర్ణునకుఖేదమునిచ్చెను. దుర్యోధనునకు మదభంజనమయ్యెను. కర్ణ దుర్యోధనులఁ గప్పియున్న చీఁకటియించుక తగ్గినది. మఱియు మునుపాచార్య దక్షిణ నొసఁగుటకుఁ గాఁబోయినప్పుడు వీరిసేనలఁ జెదరఁగొట్టిన జెట్టి యగు ద్రుపదుఁడును, నతనికుమారుఁడగు ధృష్టద్యుమ్నుఁడును బాండవులకుఁ బ్రాపగుటచే నెచ్చటఁ దమపై కెత్తివత్తురో యని జంకుచుండిరి. వైరాగ్ని యించుక యాఱి యున్నప్పుడే పాండవులు తమ యిడుములుమాని క్రొత్తపెండ్లికొడుకులై సుభద్రాదులఁగూడి, రాజసూయాది యజ్ఞములఁజేసి సుఖ ముండఁగల్గిరి. కానిమరల నాయగ్ని జ్వలించుటకు ద్రౌపదియు రాజసూయమును గారణములు.

దుర్యోధనుని మానసమునఁ గుములుచున్న యాయగ్ని పెక్కుగూఢములగు నితరమార్గములకుఁ బురికొల్పెను.

తొమ్మిదవ యధ్యాయము.

కర్ణుని యౌదార్యము.

కర్ణుఁడు దుర్యోధన భూతగ్రస్తుఁడై మైమఱచి చేయు నానుక కృత్యములట్లుండ, నాదుష్టునిసన్నిధానమున నుండినప్పుడు తన యొప్పటి ప్రకృతినుండును. దనగృహమున నతఁడు బయలం పుచ్చు సుగుణము లనన్యసామాన్యములై యనూనమములన వచ్చును. ఆతఁడు దాతృత్వమున కుపమానభూతుఁడు గనుక దానిని వర్ణింపనక్కఱలేదు. మఱియతని కారుణ్యము సత్య సంధత్వము, బ్రాహ్మణభక్తి దైవభక్తి, స్వార్థత్యాగ పరాయణ త్వము, పరోపకారము మున్నగునవి యారయ మహాద్భుత ములుగా నుండెను. అతఁడు సూర్యోదయమున నుత్తరాభి ముఖుఁడై యారాధనమునకుఁ దొడఁగి మరల నాసూర్యరశ్మి వీపునఁ దవులునంతవఱకుఁ జేయుచుండును, అతఁడు దానము చేయుకాలము మిట్టమధ్యాహ్నము. బ్రాహ్మణులేమి యడిగి నను దుదకుఁ బ్రాణములం గోరినను దప్పక యిచ్చుటకు సం సిద్ధుఁడగుటయే యతని వ్రతము. అతఁడట్టి తీక్ష్ణవ్రతములచేతను, శస్త్రాస్త్ర పాండిత్యముచేతను, జరాసంధుని జయించుటచేతను, నభేద్యములయిన సహజకవచకుండలముల యుక్తిచేతను పాండ వుల కేని మఱి యెట్టివారికేని జయింప సాధ్యముగువాఁడే యని దేవేంద్రుని యంతటి వానికే సందేహముదోఁచెను.

ఆయింద్రుఁడు, తనపుత్త్రుఁ డగు నర్జునునకుఁ గర్ణుని వలన నేమి కీడు మూడునో యను చింత శల్యమువలె బాధించుచుండెను. కర్ణున కన్నిగుణములకుమించి యతిమాత్రముగ నుండునది స్వామిభక్తి. ఆగుణము దల యెత్తకుండినంతవఱకును దక్కిన గుణములు రమణీయములై యుండును. స్వామిభక్తి యుద్రేకించినా తక్కినవితగ్గును. అట్టిభక్తికిఁ బాత్రముగ స్వామి ధూర్తస్వామిగాక పుణ్యమార్గ గామియగునే నీతనితక్కిన గుణములును భక్తియుఁ బరస్పరము కాంతి నొంది యాతని గుణరత్నాకరుఁ డనిపించును. ఆధూర్త స్వామియందలి భక్తిధురంధరత్వము తన్ను ధూర్తునిఁగావించి యంతరంగ సంపత్తిని ప్రకాశింపఁజేయక యీతని చాతుర్యమును బరాక్రమమును మాయము సేయుచుండెను. యంత్రమత్స్య ముచేతను, ఘోషయాత్రచేతను నర్జునుని యతిశయము దెలిసి యుండినను గర్ణునిగౌరవము తగ్గకుండుటకుఁ గారణ మేమనిన సహజకవచకుండలములే యాతనికాధిక్యము నిచ్చుచుండినవి. ఇంద్రుఁడైన నతని కవచకుండలముల నపహరించి క్రిందు పఱుపవచ్చునుగాని యతని తీక్ష్ణవ్రతమును ధనుర్విద్యయుఁ దొలఁగించుట కాతనికిని వీలుగాదు. కావునఁ గుండలముల వేఁడి పుచ్చుకొనుటయే చేయఁ గలపనియని యాలోచించి, తగినవేళ తెలిసికొని యతనియొద్దకరుగ నిశ్చయించుకొని యుండెను. అది సూర్యునకుఁ దెలిసి తనగారాబు

కొడుకగు కర్ణుని యందలి స్నేహమువలన నింద్రుని తలంపు వానికిఁ దెలుపవలయునని బ్రాహ్మణవేషము దాల్చి కర్ణుఁడున్నచోటికి వచ్చి యేకాంతమున నతనితో; "ఓకర్ణా! నీకుహితముగోరి యొక్క కార్యమును రహస్యముగాఁ జెప్పవచ్చితిని. నామాటలు పాటించివినుము. ఇంద్రుఁడు పాండవపక్షపాతి. కనుక వారికి హితముగాఁ గవచకుండలము లపహరింప నున్నాఁడు. అది యెట్లుచేయనున్నాఁడో చెప్పెదను. వినుము. నీకు బ్రాహ్మణులు మిక్కిలిప్రియులు. మఱియు వారేది యడిగినను వంచన సేయక యిచ్చువాఁడవు. ఇది తెలిసి యతఁడు బ్రాహ్మణవేషమున వచ్చి కవచకుండలము లడుగనున్నాఁడు. నీవు వానిని మాత్ర మీయవలదు. రత్నములో, బంగారమో, సుందరులో మఱి యేపదార్థమో చూపి, యందులకు సమ్మతింపఁడేని మఱియే పోకలనేనిం బంచవలయును. ఈరెంటిని నీయరాదు. ఇచ్చితివా మృత్యువునకుఁ బాలగుదువు. ఏలనఁగా నీమహనీయ వస్తువులు రెండును నమృతమయములు. ఈరెండునుండెనా ముల్లోకములందు నేదండిమగనికిని నిన్నుం జంపఁదరముగాదు. మఱియు నివినీ కెప్పుడును సౌఖ్యము గల్గించుచుండును. నీకు హితము సెప్పితిని. ఏమఱకుమీ!" యనెను. అందులకుఁ గర్ణుఁడతనితో, "స్వామీ! నీవు దేవుఁడవుగాని బ్రాహ్మణుఁడవుగావని తోఁచుచున్నది. నీవెవ్వఁడవో యానతి"మ్మని యడిగెను.

దానికతఁడు; "నేను సూర్యుఁడను. ఇఁకఁజెప్పెడిదేమి? నీ
యందలి ప్రేమమువలన హితముసెప్పుటకు వచ్చితిని." అనెను,
కర్ణుఁడు సంభ్రమించిలేచి యభివందనముసేసి; "దేవా! నీ
వెట్టివారికిని దుర్లభుఁడవు. నాబోటివానియం దింత హితబుద్ధి
నుంచితివి. నాభాగ్యమేభాగ్యము. నేను కృతార్థుఁడనయితిని.
అయిననొక చిన్నవిన్నపం బవధరింప వేఁడుచున్నాను. బ్రాహ్మణు
లు వేఁడిరేని నాప్రాణములనైన నిత్తునని నాప్రతిజ్ఞ.
నాయీప్రతిన రహస్య మగునది గాదు. జగమున కంతయుఁ
దెలిసినది. దానిందప్పుటెట్లు? అదియట్లుండనిమ్ము. ఇంద్రుఁ
డెక్కడ? నన్నడుగవచ్చుటెక్కడ? అట్టిముల్లోకముల దొర యే
ప్రియపడి నన్నడుగవచ్చె నేనట్టివానిచే నడిగించుకొను భాగ్యము
నాకబ్బెనేని దానికంటె నీ కవచకుండలము లొకలెక్క
లోనివే? దానివలన నాకుఁబొ[illegible] జగమెల్ల వెల్లి విరియును
గదా? అట్టిశాశ్వత కీర్తిని దిగవిడిచి నశ్వరములగువీటికొఱకై
జన్మవ్రతము దప్పుటతగునా? ఇంకొక్కటి చిత్తగింపవలయును.
ఆయింద్రుఁడు నూఱు మహాయజ్ఞములు చేసిన పుణ్యాత్ముఁడు.
వేయేల? మహాసురుల ధ్వంసముచేసిన పరాక్రమగణ్యుఁడు.
అట్టివాఁడు పాండవులయందలి పక్షపాతమునఁ దనపరువును
బ్రతిష్ఠయుఁ జూడక మాయవేసము వేసికొని యాచించునే
నతనికీర్తి డిందుపడదా? నాకీర్తి మూఁడులోకములునిండదే?

ఇదిగదా నాయశఃకాండప్రియత్వము? మహాత్మా! నేను కీర్తినెంత
మాత్రమును విడువజాలను. కీర్తిని సంపాదించుటకై నాకుఁ
జావువచ్చినను సమ్మతమే. జగమం దింతకంటెఁ జావే మేల
గుననుమాట దేవరకుఁ దెలియనిదిగాదు. కీర్తియంతయెక్కుడా
యని యందురేమో? అగును. పరమునఁ బుణ్యగతినిచ్చు
నది కీర్తియే. ఇహమునఁ దల్లివలెఁ బ్రోచునది కీర్తియె. కీర్తియే
యాయువుగాని [illegible] బూజ్యులనుగావు. కీర్తియేసంపత్తిగాని
ధనముగాదు. కీర్తిలేనిబ్రదుకొక బ్రదుకగునే? కీర్తిలేనివాఁడు
శవముగతో సాటియగును. ఆమాటలటుండనిండు. దుష్కీర్తిఁ
గలవానిని విపత్తులెల్లఁ జుట్టుముట్టిగిట్టునట్లు చేయునని బ్రహ్మయే
చెప్పియున్నాఁడుగదా! బ్రాహ్మణు లడిగిరా నాకుఁగలిగి
నంతలో గౌరవముసేయక యిచ్చుటయు, బలవంతులయిన శత్రువు
లఁ జంపుటయుఁ, జంపఁజాలకపోయిన యుద్ధమునఁ జచ్చు
టయు, నెట్టిశత్రువైనను శరణు జొచ్చెనేని రక్షించుటయు,
స్త్రీలకును బ్రాహ్మణులకును రోగులకును గలుగు నాపదలఁ బాపుట
యు నావ్రతములు. వీనిలోనొక్కటి తప్పినను నాకీర్తి
నశించును. కాబట్టి యింద్రునకేవిధమున నేనిం గవచకుండల
ములిచ్చుటతగునేకదా?" యనెను. అందులకు సూర్యుఁడు
సమ్మతింపక: "కర్ణా! ఏమిది? నీవెక్కడ? నీబుద్ధిపోవువిధ
మెక్కడ? వట్టిబేలవగుచున్నావు. కావుననే మిక్కిలి ప్రేమగల

వారు చెప్పెడిహితములు చెవికెక్కకున్నవి. చెడవలదు. నీకుఁ
దెలియునట్లు చెప్పుచున్నాను. తనకును, దన్నునమ్మిన యాలు
బిడ్డలకును, దన్నుంగన్న తలిదండ్రులకును, బంధుజనులకును
నెబ్బరకలుగకుండునట్లు గదా కీర్తిని సంపాదింపవలయును?
ఇందఱిచేటునకు మూలమైనకీర్తియు నొకకీర్తియా? అన్నిటి
కిని ముఖ్యములగునవి ప్రాణములు. ప్రాణముల నిలుపుకొనియే
కీర్తిని గడించుకొనరాదా? ప్రాణవంతునకుఁ గీర్తియొక్కటి
యే కాదు. పెండ్లము, బిడ్డలు, సంపదలు, చుట్టపక్కములు
నివన్నియుఁ గలుగవా? మనియుండువాఁ డెప్పుడైనను సార్వ
భౌముఁడు గావచ్చును గదా? ఒక్క ప్రాణ ముండినఁ గదా
యివియన్నియుఁ దక్కును! చెట్టునఱికి యాపండును గోయు
దురు? చచ్చినమనుజుఁడు తనకెంతకీర్తియున్నను దానివలఁ
బొందఁగలఁడా? చచ్చినవారికీర్తి పీనుఁగునకు సొమ్ము
పెట్టినట్లే యగును. నిన్నింత నిర్బంధించుటకుఁ గారణ మేమి?
నీకు నాయందు మిక్కిలి భక్తియుండుటవలనను, భక్తజనుల
రక్షించుట నా మొదటిపనిగాన నీకిట్లు చెప్పవలసివచ్చినది. మఱి
యు దేవరహస్యమొక్కటి గలదు. దానిం బట్టియు నీయందు
నాకు మక్కువ యెక్కుడుగాఁ గలదు. అది యిప్పుడు నేను
జెప్పనుగాని పిమ్మట నీకుఁ దెలియఁగలదు. నీకు నర్జునునకును
దీఱని వైరము గలిగి యున్నది. మీయిరువురకును యుద్ధము

గాఁగలదు. అప్పుడు నీవుసహజ కవచకుండలములతోఁ గూడి యుంటివా యర్జునునకు నిన్ను సంహరింప నలవికాదు. ఈ రెంటిని గోలుపోయితివా మిక్కిలి ముప్పువచ్చు" నని యందులకుఁగల లౌకికగాథల యుక్తియుక్తములుగా నుపన్యసించెను. దానిం గూడ సరకుసేయకుండుట చూచి, ప్రాణభయము గంటికెదురఁ గన్పట్టకల్పించి తెలిపెను. ధృఢవ్రతుఁడు వీనికెల్లఁ జంకునా ? సింగమున కెంతయాఁకలిగొనిన నేనుఁగుమిాఁదనే కన్నుగదా ? కర్ణుఁడంత సూర్యునితో; "నో దేవా ! నీవు కరుణామూర్తివి. భక్తులకు సంపద గూర్చుటయందే నీచిత్తమెప్పుడు నుండును. కాఁబట్టి నాయందలి మక్కువవలన నింతదూరమువచ్చి నన్ను ననుగ్రహించితివి. నేనొకటి విన్నవింపఁ బోయెదను. నా మాటలు ప్రతికూలములై లలితములుగాకుండినను సహింపవలయును. నేనసత్యమాడుటకు భయపడినంత మృత్యువునకును భయపడను. ప్రతిగ్రహించిన వ్రతము విడువందగునా ? విడిచిన దుర్గతికే కదా పోవలయును ? కాఁబట్టి వ్రతమునుమాత్రము పోనాడఁజాలను. అర్జునుని జయించుటకష్టమని చింతింప వలదు. నాకుఁగల దివ్యాస్త్రములు దమకుఁ దెలియవా ? అర్జును నెట్లైన యుద్ధమునఁ జంపనేర్తును. తామింక మాఱుపలుకక నాక నుజ్ఞ నీయున" దనెను. సూర్యుఁడంత కొంతసేపు చింతించి, "నాయనా! నీవెట్లైనిం గవచకుండలముల నిచ్చునట్లునిశ్చయించు

కొంటివే నట్లయినన్, నిన్నడ్డుపెట్టనాకు శక్యముగాదు. అయిన నింద్రునొద్ద నొక దొడ్డశక్తిగలదు. అదిభయంకరము నమోఘమునగునది. దాని నేనడుగుము. మున్నింద్రునుండి యా దొడ్డ శక్తి నంది యావల నాతనికి నీకవచకుండలముల నియ్య వలయును. అట్లుచేసిన నీకుభద్రమగును. ఆశక్తి యుద్ధమున శత్రువులఁ జంపిచంపి మరలఁ జేతికివచ్చుచుండును. పూర్వ మింద్రుఁ డీశక్తిచేతనే శూరులయిన యసురుల సమూహమును వేలకొలఁదిని జంపుచుండెను. నీకట్టి సాధనముండెనేని యుద్ధ మునఁదప్పక జయముగాంతు" వని చెప్పి యంతర్ధానమొందెను. కర్ణుఁ డింద్రునిరాక కెదురుచూచు చుండెను.

ఒక్కనాఁడు గర్ణుఁడు మధ్యాహ్నసమయమున సూర్యో పాసనచేయుచు బ్రాహ్మణులు గోరునవెల్ల నిచ్చుచుండెను. ఆ సమయమున నింద్రుఁడు బ్రాహ్మణుఁడై వచ్చి "భిక్షాందేహి" యనెను. "బ్రాహ్మణోత్తమా! మీకేమికావలయును? వెక్కలి సొగసుగత్తెలగుస్త్రీలా! మణిమయ భూషణములా? ఏమి కోరినను దప్పకయిచ్చెద" నని కర్ణుఁడనెను. బ్రాహ్మణుఁడు; "నాకివియెల్ల నిష్టములుగావు. నీకవచకుండలములు గావల యును. నీవు సుగుణనిధివిగదే? వీనినియ్యఁజాలితివా సరి. లేదన్నఁబోయెద" ననెను, అంతరాధేయుఁడు; "భూసుర వర్యా! ఏమిమింతయిది! నేను మేలయిన వస్తువులను నీకిచ్చెద

నని చెప్పుచుండవాని నెల్ల నుపేక్షించి పసలేనివేవ్రా యడుగు చున్నావు. నీవు వేలవు. నీవలె నిదివరకెవ్వరు నేలోకము నను నడిగినదిలే" దనెను. కర్ణుఁడేమిచెప్పినను నాబ్రాహ్మణుని నోటఁ గవచకుండలము లనుమాట దప్ప వేఱువెడలవయ్యెను. కర్ణుఁడాతని నెంతో వేఁడుకొనెను. పూజించెను. మణులు మున్నగునవి దెచ్చి యెదురనుంచెను. ఆ విప్రుఁడు వాని వానియు నొక్కటియైనఁ జూడనొల్లఁ డయ్యెను. అంతఁ గర్ణుఁడు వాని పీడుటవలనఁ దనకుఁగల్గు నపాయముల దెల్పియైనను దానికిఁ ద్రిప్పఁదలఁచి ; "అయ్యా ! నాకవచ కుండలములు దేహముతోడఁ బుట్టినవి. తెచ్చి తొడుగు కొన్నవి కావు. ఇవి లేకపోయినా యుద్ధమున బలవంతులగు శత్రువు లకుఁజిక్కి కష్టపడుదును. కావునవాని నిచ్చుటదగదు. వీనికి బదులుగా జనసమూహమును ధనధాన్య సంపదలును గల నారాజ్యము నేనిచ్చెదను. ఇంక నన్నులసట పెట్టకు"మనెను అప్పటికి నాబ్రాహ్మణుని మోమున నంగీకారసూచన మగుపింప దాయెను. అప్పుడు కర్ణుఁడు చిఱునవ్వులయ ; "మహాత్మా నిన్నుఁ దెలిసికొంటిని. నీవు దేవనాథుఁడవు. ముల్లోకములు నీపరి పాలన క్రింద వెలుఁగుచుండ నిట్లు నాబోంట్ల వేఁడుకొనుట దగునే? నీ విచ్చుటకి వచ్చి నన్ను యాచించుటయా? ఇది యుక్తమా?" యని యడిగెను. అందుల కింద్రుఁడు

"సూర్యుఁడు మున్నే నీకిదియంతయు విశదముగాఁ జెప్పెనని
తెలిసికొంటిని. పలుపలుకులేల ? కవచకుండలములిమ్ము. ఇదియు
మాకుఁ బ్రియమగునది. అన్నియుఁ దెలిసియుండ నింక
జాగేల?" యనెను. అందులకుఁ గర్ణుఁడు "అట్లైన నీచిత్తము
వొప్పునన కానిమ్ము. వీనినిచ్చుటవలన నాకు శత్రువులవలనఁ
గీడుగలుగును గనుక సకలశత్రు సంహారిణియైన నీయమోఘ
శక్తినిఁ గృపఁజేసి కవచకుండలములఁ గొను"మనఁగా;
నింద్రుఁడు దనలో;

"బళీ! మంచియెత్తు గడయే. ఇది యాసూర్యుఁడు చెప్పిన
యుక్తియే. కవచకుండలములు పుచ్చుకొని దానికి సాటియగు
శక్తినిచ్చినఁ బ్రయోజనమేమి? అంతకంటె వానిఁ బుచ్చుకొన
కుండుటయే మేలు. అయినను నీ యొడంబడికె మీఁద నిచ్చితి
నేనింగొంచెము కష్టము తొలఁగునని చింతించి; "కర్ణా! నీవడిగి
నట్లు శక్తినిచ్చెదను. అది యుద్ధములందు శత్రువులఁ జంపి
చంపి మరలఁజేతికి వచ్చుచుండును. ఇది దాని స్వభావము.
అయినను నీకిచ్చునపు డట్లుగాదు. ఒక్కతూఱిమాత్రము నీకు
జయింపఁగడిఁదియగు పగవానిఁ జంపి మరల నాకడకే వచ్చును.
ఇట్టియేర్పాటున కిచ్చగించితివేని పరిగ్రహింపవచ్చు" ననెను.
కర్ణుఁడు; "నాకుఁగల పగవాఁడొక్కఁడే. నా యీ కోరిక వానిఁ
జంపుటకే కాని వేఱుగా" దనెను. అందుల కింద్రుఁడు సుఖ

మునఁ జెఱుచవ్వాదో?ప; "నీతలంపు నేను నిజముగాఁ దెలిసి కొంటిని,అర్జునుని గెలువఁ జూచెదవు. వాఁడంత సామాన్యుఁడా? వాని శౌర్య మత్యుగ్రము. వాని తేజ మసమానము. కావున నాపని నీ కసాధ్యము. తక్కిన సన్నియు నట్లుండ మూఁడు జగ ములు నెవ్వనికి లోఁబడి నడచునో యట్టి యవ్యయుఁడగు నారా యణుఁడు దయ దలిర్ప నాతనిఁగాచుచుండఁగా నీ యాస్సిత మెట్లుకొనసాగు?" ననియెను. కర్ణుఁ; "డదియెట్లైన నగుఁగాక. అప్పటికిఁ జూచుకొనెద నిప్పుడు నా సహజకవచ మొలిచితి నేని నా దేహమెల్ల వికృతమగునే? దీని కేమి తలఁచితి" వన్నఁగా; "నీ దేహము సూర్యుని వర్ణముగల్గి వెలుఁగుచుండు"నని చెప్పివాని కమోఘశక్తినిచ్చి; "దీని నాపత్కాలమునఁ దక్కఁగక్కినపుడు ప్రయోగించితివా నీకుఁ జెడుఁగు సుమీ" యని దిట్టపఱచెను. అంతఁ గర్ణుఁడు వాఁడి కత్తినిఁగొని దేహమందున్న కవచము నొలుచుచున్నపు డాకాశమునుండి దేవతలు పువ్వుల వాన గురి పించిరి. అప్సరసలాడిరి.గంధర్వులుపాడిరి. సిద్ధసాధ్యులు స్తోత్రము చేసిరి. ఇంద్రుఁడు నతని కవచకుండలములఁ బుచ్చుకొని కర్ణుని శరీరముగాంతి యుక్తముగావించి సంతోషముతో స్వర్గమునకుఁ బోయెను. ఈ వృత్తాంతము దెలిసి కౌరవులకు దుఃఖమును పాండవులకు సంతోషమును గలిగెను.

నిఖిలాస్త్రములును వ్యర్థమగులాగునఁ బరశురామ శాపమును, రథము క్రుంగులాగున బ్రాహ్మణ శాపమును, గవచ కుండలములు పోవునట్లింద్రుని యాచనయును, నిట్లు కర్ణునిపరాక్రమమున కడ్డములు గల్గించి; పాశుపతాస్త్రలాభము, నక్షయ తూణీరగాండీవములందుట,యఖిల బ్రాహ్మణులచే నాశీర్వదింపఁ బడుట యిట్లర్జునుని పరాక్రమమును సుప్రసిద్ధము గావించినట్టి దేవుని కుట్ర యేమనవచ్చును ?

సకల భూత సృష్టిస్థితి సంహారకారణుండును, సర్వాంతర్యామియు, జగన్నాటక సూత్రధారుఁడునగు విష్ణువు భూభార నివృత్తి కొఱకుఁ గృష్ణుఁడై మధురాపురమునఁ గుంతియన్న యగు వసుదేవునికి దేవకి యందుఁ బుట్టి బాల్యముననే పూతనాదులను, గంసాదులను జంపి,యాదవసమున రుక్మిణి మున్నగువారితో ద్వారకయందు వసించుచుండెను. అమ్మహాత్ముఁడు దూరముననుండియే తన దివ్యసంకల్ప మాత్రమున పాండవ కౌరవ వైరమ్మును బుట్టించుచు భూభార నివారణమునకై వర్తించుచుండెను.

ద్రౌపదీ స్వయంవర సమయమునం దర్జునుఁడు యంత్ర మత్స్యము గూల్చుటవలనఁ గర్ణుని బలిమి తగ్గి యావైరమించుక యడఁగినట్లుండెను. కాని బొత్తుగాఁ జల్లాఱదయ్యెను. ఇంత వఱకుఁ గల్గినవైరమునకుఁ గర్ణుఁడే కారణము. వానివలననే

వైరము పెరిఁగి పెద్ద మంటగా నుండెను. ఇప్పుడు దానిని నార్పుటకు వానికి శక్యము గాదయ్యెను. అర్జునుఁడు మిక్కిలి విజృంభించుచుండి పంతవలుకును కృష్ణుఁడు దూరముననే యుండెను. ఇప్పుడు కొన్ని కారణములం బట్టి దానినిఁ ప్రజ్వరిలఁ జేయుటకై భగవంతుఁడు దగ్గఱకు రావలసిన వాఁడయ్యెను. ద్రౌపదీ స్వయంవరమైన వెనుకఁ గురుపాండవులకు నడుమఁ జొచ్చి వైరము బాఁగుగనుండెను; సూత్రధారుఁడై యుండినవాఁడే రంగము నడుమఁ బాత్రములందును నొక్కఁడై వర్తించు చట్లు వారి కార్యముల నిర్వర్తించుచుండెను. ఇపుడు ద్రౌపదియే ముఖ్యపాత్రము. అదియే వైరాగ్ని భగ్గునం దరికొల్పుట కైన యాజ్యధార. ఆకీలు బొమ్మ భారత కథారంగమునం దడుగు పెట్టినదే కృష్ణుఁడు సూత్రధారుఁడై వచ్చి దాని నాడింప సాగెను

పదియవ యధ్యాయము.

కర్ణుని పరాజయము.

కృష్ణుఁడు రెండు ముఖ్య పాత్రములు సవరించుకొని తక్కిన కార్యములకుఁ బూనిన వాఁడయ్యె. అందు మొదటిది మయుని చేత విచిత్రమగు సభనొకటి నిర్మింపఁజేసి ధర్మరాజున కిప్పిం

చెను. పిదప రాజసూయమును జేయించెను. ఆ రాజసూయము నకు దుర్యోధనుఁడు వచ్చి యుండునపు డామాయాసభ యాత నికి విభ్రాంతిని గలిగించెను. దానిని జూచి ద్రౌపది పక్కున నవ్వెను. భీమసేనాదులు పకపక నగిరి. కృష్ణుఁడు మఱి మఱి నవ్వించెను. దుర్యోధనున కారాజసూయ విభవమే కన్నులు మండించెను. మఱియు నాసభయందు నవ్వుల పాలగుటఁ 'గోరు చుట్టుపై రోకటిపో' టన్నట్లా వైరమును వృద్ధి పఱచెను. అది యట్లుండ నాయాఁడుది యేవురు మగల యిల్లాలు రాజరాజగు తన్నుఁజూచి నవ్వఁదగునా ! ఆతనికి నిమాసము నోర్వఁ గూడునా ! అంతఁ బాండవులు శకునితో నాడుటయు సంపద లన్నియు నోడి కడపట ద్రౌపదిం గూడ నొడ్డి యోడుటయు తీననేకదా కర్ణాను? దుర్యోధనాదులకు ద్రౌపది చిక్కినతోడనే మయసభ యందలి దాని నవ్వు జ్ఞప్తికి రాఁగాఁ బగదీర్చు కొనవలయునని తలఁచి, యా పతివ్రతను, సభామధ్య మునఁ బట్టితెచ్చి, చీర లొలిపించెను. ఇదియాఁగాక, దుర్యోధనుఁ డా నాబిడను దన తొడ నెక్కుమని పిలిచెను. ఆవైరాగ్ని యూరక యుండుట కీ రెండే చాలియుండవుగా ? ఇంతకంటె వైరాగ్నికిం కేమి కావలయును ? ఆ సమయమునఁ గర్ణుఁడు "ఓసీ ! నీ మగలు గొడ్డుపోయిరి. పౌరుషముగల మఱి యొకని నిందు మగనిగా వెదకి చూచుకో" మ్మనియు నావలతు

లక్ష్మనుని మనమున గాటముగా నాటుకొని వాని మరణానంతర
మునఁగాని మానదయ్యెను. ఆబిడ మహాపతివ్రత. త్రిలోకధీరు
లగు పంచపాండవులయొక్క ధర్మపత్ని. ఎండకన్నెఱుఁగని యిల్లా
లెక్కడ? రాజులు నిండియున్న సభకీడ్చి తెచ్చుట యెక్కడ?
తెచ్చి చీరలొలుచుటయెక్కడ? ఇది దుస్సహము. అతిదారు
ణము. పరమఘోరము. మఱియప్పటి నవ్వే యిట్టి పన్నుగడకు
మూలమైనది. కర్ణుఁడు వైరాగ్నిని జ్వలింపఁజేయుటకు శక్తుఁడు
గాకున్నను, జ్వలించుచున్న కట్టియనొకదాని నెగఁద్రోచి,
తనభృత్యకృత్యమును నిర్వహించుకొన్నవాఁడయ్యెను. ఇదియే
కర్ణుఁడు తన జన్మప్రయోజనమగు వైరాగ్నివృద్ధికిఁ గడపట
జేయఁజాలిన మహాకైంకర్యము. ఇట్లువైరము జల్లాఱకుండు
టకే పంద్రెండేండ్లు వనవాసము నొకయేఁ డజ్ఞాతవాసము
నేర్పడినవి. ఆయరణ్యవాస మేర్పడుట దానంగల్గిన క్లేశము
మూలమునఁ బాండవుల పాపక్షయమునకును, రాజ్యభోగాను
భవము మూలమున దుర్యోధనాదుల పుణ్యక్షయమునకును
గారణమయ్యెను. వారికి దానివలనఁ బ్రభావము హెచ్చఁగా,
వీరికిఁ బ్రభావము తగ్గుచువచ్చెను. అందులకుదాహరణము లోకో
మునకుఁ దెలుపుటకై దుర్యోధనుని ఘోషయాత్ర జరిగినది
గంధర్వులకుం జిక్కిన కౌరవులఁ గర్ణునకు విడుపింప వీలుగా
కుండ నర్జునుఁడే విడిపించెను. ఆరణ్యవాసము కడపట నర్జు

నుఁడు, భీష్మాది సకలవీరులకును నగ్రగణ్యుఁడై శూరాగ్రేసరుఁ
డాయెను. అజ్ఞాతవాసాంతమున దక్షిణ గోగ్రహణసమయ
మున గోవుల మఱలించి విరాటనగరమునకుఁ దోలుకొనిపోవుట,
భీష్మాదులు వెక్కండ్రుగూడి యర్జునున కొక్కనికోడుదురని
లోకమునకు రూపించుటకు భగవంతుఁడు గావించిన పరిశీలన
మేకాని, మఱియొకటిగాదు. ఇట్లు భగవంతుఁడు, దక్షిణ
గోగ్రహణమున నర్జునునకు వలయు సాధనసంపత్తి యెల్లఁ
గుదిర్చి మహాభారత యుద్ధమునకుఁ నాయితపఱచెను. అజ్ఞాత
వాసమును దీఱెను. మరల నర్ధరాజ్యమునకుఁ బూర్వ నిబంధన
ము చొప్పున నడుగుట ధర్మమునుఁబట్టి తామై కయ్యమునకుఁ
గాలుద్రవ్వరాదనుటకొఱకే కానివారి తపస్సును, సుగుణసంపత్తి
యు, వారి నఖండ మహీమండల రాజ్యధురంధరులను గావింప
నుండఁగా, నర్ధరాజ్యమునకు రాయబారములు ప్రవర్తిల్లవలయు
నే? ఇంతియుఁ గృష్ణుఁడే రాయబారియయ్యె. మృత్యుసంహారమునకై
పుట్టినవాఁడు, సంధియెట్లు చేయును? మహాపతివ్రత నట్లు భంగ
పఱచిన పాపులకు, ధర్మవ్రతుల నట్లల్లాడఁబెట్టిన యాదుష్టులకు
సకుటుంబ వినాశమే ప్రాయశ్చిత్తము. ధర్మనాశమున నెంతబద్ధు
లైనను; వారిపత్నిని అందును రాజపత్నిని, అట్లు సభామధ్యమున
భంగపఱచుచుండఁగాఁ గాచుటకు మించినది మఱియేధర్మము?
ఇట్టిమానమును గాచుటకులేని శస్త్రాస్త్రములు కాల్పనా!

అది మగతనమా! యని సందేహముతోఁ జూచుచున్నది. ఇది దైవతంత్రము. కాకున్న సైంధవకీచకు లాబిడను దాకినంత మాత్రముననే యెట్లయ్యిరి? పాండవులా యంతటి ఘోరమును జూతురు? అట్టి దుర్యోధనాదులనే కాక వారిప్రక్కఁ జేరిన భీష్మాదులనుగూడ నశింపఁజేసి భూభారావతరణము గావించుటకై యంత గొప్పశాంతినిచ్చుట భగవంతుని సంకల్పము. ద్రౌపది కన్నీ రొక్కొక్కబొట్టును, ధర్మరాజుయొక్క కనుఱెప్పపాటును గాలకూట విషములై కాలాగ్ని జ్వాలల వలె రగులుచుండెను. యుద్ధమున కిరుప్రక్కల సన్నాహములు జరుగుచుండెను. కర్ణుని పురుషకారమింక నక్కఱలేదు. అయిన నప్పటి యాతని యుద్ధక్రమము చలింపని, స్వామిభక్తి, వీరవ్రతమును శౌర్య పరాయణత్వమును వేనోళ్లఁ జాటుచుండెను

కృష్ణుఁడు దుర్యోధనాదులకడకు రాయబారియై పోయినపు డాతని సంధివాక్యములకు దుర్యోధనుఁడు సమ్మతింపఁడయ్యె. అందులకు మాఱుగా నతనిం జెఱఁబెట్టినయెడలఁ బాండవులకు బలముడుగునని తలఁచి, దుర్యోధనుఁడును, కర్ణాదులును కుట్ర పన్నిరి. కాఁబట్టి యతఁడు విశ్వరూపమున వారినిభయపెట్టి యుద్ధమునకు సిద్ధులుగండని, చెప్పి బయలువెడలిపోవునప్పుడు తన్నుఁ బట్టఁ దలంచిన కుట్రలోఁగుమికాఁడయిన యాకర్ణునిం జేయిఁ బట్టుకొని "నన్నుఁగొంతదూరము సాగనంపివత్తువు ర"మ్మని

తోడుకొనిపోయి, యేకాంతస్థలంబున నిలిచి రహస్యమున నతనితో, "కర్ణా! నీవు పెద్దలను సేవించినవాఁడవు. ధర్మములు నీకుఁ దెలియనివి లేవు. కాఁబట్టి యొకటి తెలియఁజెప్పెదను వినుము. నీవు పాండవుల కన్యుఁడవు గావు సుమీ! ఒకసిద్ధుని మంత్రబలమువలన సూర్యప్రసాదమునఁ గుంతి కన్యగానుండునపుడు పుట్టితివి. కాఁబట్టి పాండురాజునకుఁ బెద్ద కొడుకవు. ధర్మరాజు మొదలగు నీతమ్ములంగఱకు నేనుజెప్పితినా తోడనే వారు నీయడుగులకు మ్రొక్కి తమ పుత్రమిత్ర బంధు వర్గములతోను, చతురంగబల సమూహములతోను, నిన్నుఁగొలిచి రాజ్యమునకుఁ బట్టము కట్టుదురు. అప్పుడు నీవెట్లు ప్రకాశింపఁగలవో తలంచి చూడుము. ఇట్లు నడచుటయే ధర్మమార్గము గనుక వేగవారికడకురమ్ము. వారేల? నిన్ను సామ్రాజ్యమునకుఁ బట్టముకట్టుటకు నే నొక్కఁడనే చాలుదును. నీవు పట్టాభిషిక్తుఁడవై మొట్టమొదట వెడలునపుడా వైభవ మెంతోయుండఁగలదు యువరాజై ధర్మరాజు నీకు వింజామరములు వీచును భీముఁడు నీకు ధవళచ్ఛత్రము పట్టఁగలఁడు. అర్జునుఁడు సారథ్యముచేయును. వీరేకాక వీరిబంధువులయిన, పాంచాలురు, యాదవులు మాత్స్యులు మొదలగు రాజులు, నకుల సహదేవులు, నభిమన్యుఁడు మొదలగు కుమారులు మేమందఱము గూడుకొని, నిన్ను నలు

ప్రక్కలఁ బరివేష్టించిన త్తుము ఇట్లు మహేంద్రవైభవముతో భూచక్రమంతయు నేలుము. అదంతయు నట్లుండనిమ్ము. జగదేక సుందరియగు ద్రౌపది నిన్నాఱవ పతిగాఁ బొందఁగలదు. అప్పుడు నీపుణ్యమేమని చెప్పవచ్చును? మాఱాడక, మఱి యొకటి తలంపక నాతోడ కదలి రమ్ము. ఇట్లు చేసితివేని, కుంతి కిని, దక్కిన బంధుమిత్రుల కెల్ల వారికిని ప్రియమగు" ననెను.

కర్ణుఁడంతయు విని, కృష్ణునితో; "ఔను. నన్నుఁ గుంతియెట్టు లయినను బోషిమ్మని చట్టుపిడిచిపోయెనుగదా! సూతుఁడు దయతోఁ దెచ్చి తనప్రియురాలి కిచ్చెను. వారింత కాలము గారాబముతోఁ గన్నకొడుకువలె నన్నుఁ బెంచిరి. నేఁటికి వా రెవరోయని తెలియఁగా సొంతము లేదని వారిని దిగవిడిచిపోయిన నాపోఁడిమి చెడదా? నావంత కఠినపుమనసా! పెద్దలను సేవించిన వాఁడననియు ధర్మమార్గము లెఱింగిన వాఁడననియు, నీవే చెప్పితివే! రాధయు, నతిరథుఁడును, నాకు జాతకర్మము మొదలగు సంస్కారములనెల్లఁ దమకులమునకుఁ దగునట్లు చేసి నందులకు, వారుధర్మంబున నాకుఁదలిదండ్రులయిరి. వారి మొదల నేనుబుత్త్రునివలె నడుచుటకు మాఱు దిగనాడి వచ్చుట ధర్మమా? వారిని విడుచుట ధర్మముకాదని తలంపక రమ్మనెదవే! దామోదరా! ఇదినీకుఁదగునా! అదియెల్ల నట్లుండ సుయోధనుఁడు నన్ను సూతుని కొడుకనిచూడక;

తనకన్న కొడుకులకంటెను, దోడఁబుట్టిన తమ్ములకంటెను నాకెంతో ప్రీతిగావించి నానాఁటికి నాకుఁ దేజస్సును, వైభవమును, నభివృద్ధమగునట్లుగాఁ జేసి కడపటఁ దనయంతవానినిగాఁ జేసెను. అట్టిదొర, నట్టియుదారుని బగవారు ముట్టివచ్చినపు డేధర్మమునుబట్టి విడిచివత్తును? నీవే చెప్పుము. చూతము. ఇంతియకాక యతఁడు నన్నాయర్జునునకు నెదిరిగా నమ్మియున్నాఁడు. ఆనమ్మిక వమ్మగునట్లుగాఁ బాండవులను గలయ వచ్చుట నాకుఁదగదు. వీరువారననేల? భూమియందలి జనులు, నేనును, నర్జునుఁడును, నొకరినొకరు దలపడి పోరకున్నయెడల పకపకనవ్వరా! నేనచటికివచ్చిన నర్జునున కపకీర్తి యౌను నింక నాకేమియో చెప్పనలయునా! నీవు మిక్కిలి నిక్కలాత్ముఁడవుగావన హితముచెప్పితివి. కానిసాహసించుట నా మది కెక్కకున్నది. ఒక్కటిచెప్పెదను. నా జన్మరహస్యమును మాత్రము నీమనముననే యడఁచి రక్షింపుము. వెలిపుచ్చితివేని దాన నెంతయుఁ గష్టము సంభవించును. ధర్మరాజునకు నే నన్నయగుట తెలిసెనా యుద్ధమున కాతఁడు పూనఁడు సుమీ! అట్టిధార్మికుఁడే గదా భూతలమునెల్ల నాచంద్రార్కముగాఁ బరిపాలింపఁదగిన వాఁడు. అతనితమ్ములు ఋత్విజులుగాను నీవుపద్రష్టవుగా నుండి కురుకుమారులనెడి పశువులను బలి యుద్ధయజ్ఞముజరుపుటమేలు. దానివలనఁ గురుక్షేత్రము పుణ్య

భూమి యగును. అందు మాబోటులెల్ల సద్గతి నడయుదురు
గాక" యనెను. కృష్ణుఁడు "ఓయీ! "నేను గనికరమున
హితముచెప్ప నీవిటు పెడచెవిని బెట్టుదువే? ఈపట్టునీకుఁ గడ
పటి సంతాపము నిచ్చును జుమీ! అర్జునునితో మచ్చరించితి
వేని నోడుదువు. లేక చత్తువుకాని గెలుచుటయెక్కడిది? నీ
కొక్కనికేఁగాదు. అనేకులకుఁ గాలమిట్లు తుదముట్టునే? నీ
మనము శాంతితనందదుగా? అన్నిటికింటె వింతయగున దర్జు
నుని గెలుతునని నీవెంచుట. అతఁడు గాండీవమును, దివ్యాస్త్ర
ములను దాల్చియుండియు, నేను రథము నడపుచుండఁగా
నీకెదురుటకుఁ దరమా? ఇంత చెప్పి నిన్ను బ్రదిమాలనేల?
సర్వవిధములఁ బాండవులే జయింతురు. అదియెట్లయిన నగుఁ
గాక ఇక్కాలము సౌమ్యమై పుష్పఫలసమృద్ధమై, సస్యములు
నిండారఁబండి, సంతోషప్రదమై యున్నది. నేఁటి కెనిమిదవ
దిన మమావాస్య వచ్చుచున్నది గదా? ఆ పుణ్యదినమున
యుద్ధ మవశ్యము జరుగఁగలదు." నావిని కర్ణుఁడు "కౌరవ
పాండవుల యుద్ధము కలుగఁగలదని శకునములును స్వప్న
మును నయియున్నవి. దానియందు ధర్మజునకే జయము
కలుగుననియుఁ దెలియును. నీవు చెప్పనక్కఱలేదు. ఈకారణ
మును బట్టియె నేఁ బాండవులతోఁ జేరనని చెప్పితిని. దీనికి
మూలము, శకునియును, దుశ్శాసనుఁడును నేను నగుదుము,

కాని వేఱెవ్వరుగారు. తక్కినవా రిర్వురు పాండవులను గలసి
లేని నేనును గలువవచ్చును. అది యటుండనిమ్ము. ఈయుద్ధంబున
గెలిచియేని నిన్నుఁజూచెద. కాదేని పరలోకంబునుగాంచెద
నింకేమియు నడ్డుపలుకకుము పోయివచ్చెద"నని కౌఁగిలించు
కొనెను. కృష్ణుఁడు "అట్లకానిమ్ము. పో"మ్మనఁగా నతఁడు
కృష్ణుని రథమునుండి దిగి తనరథమెక్కి హస్తినాపురమునకుఁ
బోయెను. సకల భూమండలరాజ్యమునకంటె స్వామిభక్తి
పరాయణుఁడును బితృభక్తిపరుఁడు నగుకర్ణునకుఁ సుయోధన
రాధాసూతులకు సంతోషమిచ్చుటయే ముఖ్యము.

పదునొకండవ యధ్యాయము.

కర్ణుని ధైర్యము.

కృష్ణుఁడు పోయినపిదపఁ గుంతి పాండవ కౌరవులకు యుద్ధ
మాసన్నమగుటచూచి, తనలోఁ "గట్టా! సంపదకని, చుట్టాల
నెల్లఁ జంపుట ధర్మమా! యుద్ధమునఁ జొరఁబడినపిదప భీష్ముని,
ద్రోణుని, రూపుమాపుట సులభముగా నగునా! అందుఁ
గర్ణుని మనస్సు పార్థుని, పయిని రోషముచేఁ గ్రాఁగుచున్నది.
వానికొక్కనికేఁదక్క నింకెవరికిని యుద్ధమందంత యుత్సాహ
ములే"దని, చాలసేపు చింతించి, తనలో "ఇంకేల? కర్ణుని
తో వానిపుట్టుకనుగూర్చి తెలిపితినా! పాండవులు తోడబుట్టువు

లని యెంచెంగినపిదపఁ బ్రియము పూనక తీఱఁడు. అప్పుడు యుద్ధము మానుకపోవునా!" యని యాలోచించి యతని నివాస మునకుఁబోయెను. కాని యతఁడనుష్ఠానము కొఱకు గంగకుఁ బోయి యున్నాఁడని విని యదిమఱెంత యేకాంతమగు టను బట్టి యచ్చటికేఁబోయెను. అప్పుడు కర్ణుఁడు జపము సేయుచుండెను. కాన నామె యతని వెనుకఁ గూర్చుండెను. కొంతసేపునకు జపము చాలించి కర్ణుఁడు నలుప్రక్కలఁజూడఁగాఁ గుంతీదేవి కనఁబడెను. అతఁడు సంభ్రమమును, వినయ మును మదిని బెనగొన దగ్గఱకుఁబోయి, తన ప్రవరఁ జెప్పుచు నభివాదనము గావించు నపుడు రాధేయుఁడ నిచెప్పెఁ: "అమ్మా! మీరువిజయముచేసిన కార్యమేమి? ఆనతిత్తురు గాక" యని యడిగెను. అందులకుఁగుంతి "నాయనా! నీవెక్కడ! సూతకులమునఁ బుట్టు టెక్కడ! నేనుమాతండ్రి కుంతి భోజుని గృహమునఁ గన్యాత్వమున నుండునపుడొక మంత్రబలమువలన సూర్యదేవు నావాహ్వానముచేసితిని, అతఁడువచ్చి దయసేయగా నీవు నాకుఁబుట్టితివి. నాకడుపునం బుట్టుటచేఁ బాండవుఁడవయి తివి. కనుక నీతమ్ములయిన పాండవులకును, కౌరవులకును బెద్దవు. వారిని వెంటఁబెట్టుకొని, యీలోకమెల్ల నేలవలసిన ప్రభువని తెలియక రాధకొడుకు సూతకులమని చెప్పుకొనునట్టి యీలెక్కవయేల నీ?" యనెను. ఆబిడ యిట్లుచెప్పుచుండఁగానే

సూర్యబింబమునుండి "ఇదినిజము, వత్సా! ఈవిధముననే నడచుకొనుము. నీకుమేలగు"నను వాక్యము కర్ణునకు స్పష్టముగావినఁబడెను. జగన్నాథుఁడు కర్ణునకు మఱింతగట్టిగా నెత్తి చెప్పినను, అతఁడన్యుఁడగుటచే వినఁడేమో యని కన్నతల్లియే వచ్చిచెప్పెను. పాండవుల తల్లికదా యని పాటింపఁ డేమో యనిజనకుఁడగు సూర్య భగవానుఁడే యాకాశము నుండి ఘోషించెనుగదా! అంతకంటె విశ్వసింపఁదగిన దెద్ది? ఆమాటలకును గర్ణుని మనస్సు తిరుగఁబడదయ్యె. ఏమి యితనిధైర్యమహిమ? అతఁడంతటికిని, జలింపక తల్లిని జూచి, "నీవు చెప్పినదినిజము. కాని నేనొక్కటిజెప్పెదను చిత్తగింపుము. నీవునన్నుఁ గనినతోడనే విడువవలసిన దానవయితివి. దాన క్షత్రియ సంస్కారములు నాకులేకపోయెను. కనుక నిపుడు మందును, బరమందును, నీకుఁబుత్త్రుఁడనని చెప్పుకొనుట పాడి యగునే? నాజన్మము పరమ రహస్యమే యగుఁగాక. మఱి సూర్యుని ప్రసాదమువలన నింద్యముగాకుండునుగాక. దీనినింకఁ బ్రకాశము సేయకుండిన మేలగును. మఱి యర్జునుఁడు మహా ధనుర్ధరుఁడని యంతటను బ్రఖ్యాతుఁడై యుండఁగా నేనిట్టి సమయమునఁ గుంతికొడుకనియు సూర్యునికిఁబుట్టిన వాఁడ ననియు నీకారణమున వారింజేరఁబోయితినేని, భయపడిచేరితి నని జను లాడికొందురు. అర్జునుని మాట యట్లుండెఁ గఁ॥

యగు దుర్యోధనుఁడు నన్ను దెప్పఁగాఁ గొని యీయుద్ధసముద్ర
ము నీఁదవలెనని యున్నాఁడు. అదిగో సమీపింపవచ్చి
నది. ఇన్నాళ్లు వారియన్నముదిని, వారివలువఁగట్టి; యిట్టి విపత్స
మయమునఁ బెడఁగాకయని, విడిచిపోవుట ధర్మమా! వారికిఁ
దోడుపడుట కిదియె మంచిసమయము. పగవారు ముట్టివచ్చి
నప్పుడు, కావలసిన వారెవరేనిం బాయుదురా! అట్లుచేసిన
రాజులు మనలను దిట్టరా! కాఁబట్టి యెట్లును, దుర్యోధనునకై
నీకొడుకులతోడఁ బోరాడుదును. నీవుచెప్పిన దెంతయుక్తముగా
నుండినను వినఁగూడకున్నది. ఇట్లని యూరక చెప్పుటగాదు. ఇది
నిశ్చయము. ఇంక నీవీపనిమీఁద నింత యక్కఱపడి వచ్చితివి
గాన, యూరక పంపుటకు మనసొప్పకున్నది. కావున నీయిష్ట
మునకై తక్కిన పాండవులు నలుగురు చిక్కిరా చంపకవిడిచి
పుచ్చెదను. అర్జునుఁడు చిక్కెనా విడువక చంపియ తీఱుదుఁ
జుమీ! దాఁపక చెప్పితిని. అర్జునుఁడు నన్నుఁ జంపినను గీర్తి
కరమే. నీకొడుకులతనితోడ నయిదుగురేని, నాతోడ నయిదు
గురేనిఁ గావలయునుగాని యీఱుగురనుమాట యింక విడిచి
పెట్టుము." అనెను. అందులకు గుంతిమనస్సున శోకము మిక్కు
టమై "అయ్యో! ఇది దైవఘటనము. ఇది యెట్లును దప్పునా?
తప్పదు." అనితలఁచి కర్ణునితో "నీ విప్పుడు చెప్పినమాట
మఱవకుము మఱవకుము, నీతమ్ముల నలుగురిని విడిచిపుచ్చుము.

అర్జునుని నెడల నీయిష్టము" కర్ణుఁడందులకు సమ్మతించి యామె
కు వినయవిధేయతలు ప్రకాశింప మ్రొక్కి యాయమను
వీడుకొలిపి తనగృహమునకుఁ బోయెను. భగవానుండు పంచ
పాండవులయం దర్జునునకుఁ గర్ణునివలన భయమెంతమాత్రము
లేకుండునట్లు జేసియున్నది. తక్కిన పాండవులలోనే చేసి తని బారినిపడి
చేసిం బ్రాణములు దక్కించుకొనుట కష్టముగాన, వారింగూడ
వానినుండి తప్పించుటకే కుంతిచేత వరమడిగించినాఁడు; మఱి
భీష్ముఁడు గాని, ద్రోణుఁడుగాని పంచపాండవులనేమి చేయరు
కదా? కనుక జగన్నాథుఁడు, పంచపాండవులకు వలయు రక్షణ
ములనెల్ల సంతరించి, యాశ్రిత రక్షణవ్రతమును, శరణాగత
త్రాణబిరుదమును, నెలకొలుపుకొన్న వాఁడయ్యెను. ఇంక
దుష్టశిక్షణమే కావలయును. శిష్టరక్షణమూలమునఁ గదా
యది గలుగును? కావుననే శిష్టులగు పాండవుల కెల్లవారికి
రక్షణము గావించినవాఁడయ్యెను. కావున దుష్టశిక్షణ యావ
మగు, భూభారావతరణమునకు, శిష్టరక్షణారంగము ఆవశ్యక
ముగా నిర్వర్తిత్తము. భీష్ముఁడు మొదలగు పెద్దలకును, గర్ణున
కును, మాటలయందు విరోధముఁ గలుగుచుండెను. వారు
దుర్యోధనునకు హితములు చెప్పుచుండఁగాఁ గర్ణుఁడు నడుమ
వచ్చి వారిని గ్రిందుపఱచి, దుర్యోధనున దెల్ల ధర్మమనియు
నధర్మమైనను దన బాహుబలమతనికి, వజ్రాయుధమనియుఁ

ప్రగల్భములాడుచుండును. స్వామి భక్తిరసావేశము తెలివిని గప్పుటవలనఁగాని తెలియక చెప్పుటగాదు. ఆ పెద్దలునుఁ గర్ణుని కసరుచుండుటగలదు. భీష్ముఁ డుభయపక్షములందు నతిరథ మహారథులను వేర్వేఱుగా నిర్ణయించి చెప్పునప్పుడు, కర్ణుని బ్రాహ్మణశాపమువలనను బరశురాముని వలన నస్త్ర విద్యచెడు టవలన, నర్ధరథుఁడనెను. ద్రోణుఁడు; "నేనే, యని వాఁడు తన్ను నెదిరిని దెలియక వదరును. ముట్టఁబడినపుడు పాఱిపోవు" నని చెప్పెను. ఇదియునిజమే? కర్ణుండంతటి వాఁడయ్యుఁ బెక్కు మాఱు లర్జునునకు నోడిపోయెను. ద్రుపదునకోడెను. గంధర్వుల కోడెను. ద్రౌపదీస్వయంవరమునను, దక్షిణ గోగ్రహణము నందుఁగూడ నాపార్థునికినోడెను. మరల వాడెంత వీడెంతయని బింకము లాడుచునేయుండెను.

పండ్రెండవ యధ్యాయము.

యుద్ధము.

కర్ణుఁడు గాంగేయుఁడు దన్నర్ధరథుఁ గావించెనని కోపించి యాతఁడు యుద్ధము చేయుచుండినంతవఱకుఁ దాను శస్త్రము ముట్టకుండునట్లు ప్రతిజ్ఞ చేసికొనెను. యుద్ధమారంభమైన పది దినములకు భీష్ముఁడు యుద్ధరంగమునఁ బడి శరతల్పమున నుండెను. అప్పు డుభయపక్షములవారును నతనిని బూజించి

పలుకరించిపోయిరి. పిదపఁ గర్ణుఁడతనికడకు రాఁగా నతఁ డెవ్వరు వారని యడిగినపుడు, కర్ణుఁడు "నేనురాధేయుఁడను. నాయందలి వాత్సల్యముతోఁ జల్లనిచూపు నాపయిని నిగుడించి మాటలాడ వలయు"నని, భక్తివినయపూర్వకముగ మ్రొక్కి వేఁడెను. భీష్ముఁ డతనిని దగ్గఱకుఁ జేరఁబిలిచి యొకచేయి పైని వైచి కౌఁగిలించి యచ్చటనున్న కావలివారలు మున్నగువారి నావలకుఁ బోవఁబుచ్చి యేకాంతంబున నతనితోఁ, "కర్ణా! నీయందు నాకుఁగోపమెక్కడిది? అప్పుడప్పుడు నీకుఁ గోపము పుట్టునట్లు భేదముగా మాటలాడియున్నాను. అయిన నట్లు భేదముగాఁ బలుకుట యెల్ల బిడ్డలఁ జెఱుపరాదనియేకాని మఱొకటిగాదు. అది శిక్షయేకాని, వేఱుకాదు. అదియునుంగాక నీవు సూర్యుని యనుగ్రహమునఁ బుట్టినవాఁడవు. కనుక నీకుమనుష్యులు సాటిగారు. మఱియు నీవు కుంతికొడుకవేకాని, రాధ కొడుకవుగావు. ఇదివ్యాసుఁడు నాకు రహస్యమున నెఱింగించెను. వారు తెలుపుటయేకాదు, నీ తేజోవిశేషముల వలనఁ గూడ నాకుఁ దెలియుచుండును. నీవు పాండుకుమారుఁడవు కావున నీయందునాకు వాత్సల్యమేకాని మాత్సర్యము గలుగదు. ఒక్కటిచెప్పెదను వినుము. నేనిపుడే కౌరవులకును, పాండవులకును, వైరము వలదని యడఁపెదను. పాండవులంగెలువఁనెవరికినిదరముగాదు. ఏలన? వారిపక్షమున నప్రమేయుఁడగు

కృష్ణుఁడున్నవాఁడు. అట్టివారలతోఁడి విరోధము తగదు. నీవు
వేఱుతలంపులేక వారితోఁడఁ గలిసియుండు"మనెను. అందులకుఁ
గర్ణుఁడు "నేనుగొంతికొడుకనే యగుదును. అదియంతయు
మున్ను పెద్దలు కొందఱుచెప్పఁగా వినియేయున్నాను. అంతయుఁ
దెలిసినను గుంతికొడుకుల తోఁడి, పొత్తునాకుఁదగునా? వీరో
మహాబలవంతులు. మఱియువారికిఁ గృష్ణుఁడు సహాయుఁడు
కాఁబట్టి వారిని యుద్ధమందు జయించుట కష్టమని నాకును
బాగుగఁ దెలియును. అయినను గురుపతి చేయుమన్నన లన్నిఁ
టిని దలఁచి చూడఁగా నేనతని, దిగనాడిపోవుట ధర్మమా?
అది వీరునికిఁదగు ధర్మమగునే? అవన్నియు నట్లుండ మఱి
నే నాపాండవుల నెన్నియో దుర్భాషలాడితిని. మఱియు వారిని
నేనెన్నియోతడవ లవమానించితిని. ఇఁక వారికిని నాకును
వియ్యమును నెయ్యమును గలుగునే? కయ్యమేయుక్తము.
వేయిమాటలేల? అంతయు దైవాయత్తములు. కనుక నీవు
నన్నేమియు ననక పరసైన్యము దాఁకుట కనుజ్ఞయిమ్ము నా
బలము లోకమెల్లఁ గొనియాడఁ దగినది" యని వీరరసోల్లాసం
బునఁ బలుకగా భీష్ముఁడుత్సహించి "కర్ణా! నీవు చెప్పినంత
చేయువాఁడవే. ఇది నే నెఱుఁగనా? దుర్యోధనునకుఁ దోడు
నీ[illegible]మేకదా! అతని కేదిప్రియమో దానినేచేయుము.
అదియే గొప్పబుద్ధి. నీమనస్సునం దనుమానమువలదు. యుద్ధ

మున కనుజ్ఞ యిచ్చితి" నని ముఖవికాసముతోఁ బలికెను. కర్ణుఁడు భీష్ముని బంధుభావమునకుఁ బరమానందమును బొంది, తన విడిదిపట్టునకుం బోయినవాఁడయ్యె. భీష్ముఁడు యుద్ధము చేసి కడపట నర్జునుని బాణముల యుకవడిని గొట్టువడిన వాఁడయ్యె అపుడు త్తరాయణము పుట్టకుండెను కనుక నుత్త రాయణము వచ్చునఁటకుఁ బ్రాణములు మేనియందే నిలిపికొని యుద్ధరంగమునందు బరుండియుండఁదలంచెను. అపుడతఁడొక తలగడయడుగగా, జుట్టునున్న రాజులు, మెత్తలు, తలగడలు, గొనిపోయిరి. అతఁ "డిన్ని, ఇవి వీరశయనమునకుఁ దగినవి గావని, యర్జునునిఁబిలిచి తగిన తలగడ పెట్టుమనఁగా నతఁడు గాండీవము నెత్తికొని నారి సారించి, చక్కని బాణములను భూమిని మోపి నిలుచునట్లుగా నేసి యతనికిఁదలగడ గావించెను. [illegible] దప్పిచే రాజులను జలము దెమ్మనఁగా వారు మిక్కలి చల్లని, తీయని జలములను దెచ్చిరి. కాని యతఁడు వానిని రోసి "నేను మనుష్యభావమును గడిచితిని. మానుషములగు పదార్థ ములనుపయోగించను హంసతూలికాతల్పమునందున్న పుడుగదా యవి వలయును ఈ యంపశయ్యనున్న వానికిఁ గా"దని మరల "నర్జునా! నాకుఁదగిన జలము దెమ్మనఁగా నతఁడు పర్జన్య మంత్ర పూర్వకముగా బాణము భూమినిగాఁడ నట్లుప్ర యోగించెను. అపుడు భూగర్భమునుండి పవిత్రములగు చల్లని